విలేకరులు కావలెను

"ప్రజా శంఖారావం" తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

"ప్రజా శంఖారావం" తెలుగు దినపత్రిక.

సంప్రదించాల్సిన చిరునామా..
నిజామాబాద్ సెల్ : 9440731515



epaper.prajashankaravam.com

తెలుగు డైలీ ఈ-పేపర్

RNI NO: TELTEL/2022/85170

# ప్రజా శంఖారావం

తెలుగు దిన పత్రిక

ప్రతి అక్షరం.. ప్రజా స్వరం..

PRAJA SHANKARAVAM TELUGU DAILY

పేజీలు 8

శనివారం 25.04.2026 | సంపుటి: 03 | సంచిక: 354 | వెల: రూ. 3/- | ఎడిటర్: పుట్టి మురళి

హైదరాబాద్ | ఆదిలాబాద్ | నిర్మల్ | నిజామాబాద్ | కామారెడ్డి | జగిత్యాల | మంచిర్యాల | సిద్దిపేట్ | రాజన్న సిరిసిల్ల | సంగారెడ్డి | మెదక్




2

## శంకర్ గౌడ్ మృతి విషాదకరం

- ఈ బలిదానం తీవ్రంగా కలచివేసింది
- మాజీ మంత్రి హరీష్ రావు ఆవేదన



2

## ఆర్టీసీ కార్మికులకు రేవంత్ తీరని ద్రోహం

- సర్కారు నిర్లక్ష్యమే శంకర్ గౌడ్‌ను బలితీసుకుంది

# ఆర్టీసీ సమ్మెకు బలైన శంకర్‌గౌడ్



పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం
చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి
సీఎం రేవంత్ సంతాపం, మంత్రి పొన్నంల సంతాపం

**హైదరాబాద్, ఏప్రిల్ 24:**
ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన నర్సంపేట డిపో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్(55) హైదరాబాద్ అపోలో హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు. అపోలో హాస్పిటల్‌లో శంకర్ గౌడ్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయింది. బంధువులకు శంకర్ గౌడ్ మృతదేహాన్ని అప్పగించగా. స్వస్థలానికి తరలించారు. వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ శంకర్‌గౌడ్ గురువారం పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న విషయం తెలిసిందే. రెండోరోజు సమ్మెలో భాగంగా గురువారం

మిగతా 2వ పేజీలో..

## శంకర్ గౌడ్ అంత్యక్రియల్లో ఉద్రిక్తత

- ముత్తోజీపేట చేరిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- మృ తదేహాన్ని నర్సంపేట డిపోకు తరలించాలని కోరిన కుటుంబీకులు
- నివాళి అర్పించే అవకాశాన్ని కల్పించాలని కోరిన కార్మికులు
- రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలున్నందున ససేమిరా అన్న పోలీసులు
- పోలీసుల తీరుపై కేంద్ర మంత్రి ఆగ్రహం



2

## కొత్త డిస్కమ్ కోటి అనుమానాలు !

విధానాలపై స్పష్టతలేదు విధులు ఎలా సాధ్యం

- 99 విద్యుత్ సంస్కరణల్లో ఉద్యోగ భద్రతుంది
- ఉద్యోగుల అనుమానాల నివృత్తి చేస్తూ చట్టం సైతం ఏర్పాటైంది
- అసలు ఈ డిస్కమ్ ఏర్పాటు ఎందుకు
- వినియోగదారులకు ఒనగూరే ప్రయోజనం ఏంటి ?



3



# కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు భారీ ఊరట

- హైకోర్టు కీలక తీర్పు – కేసులన్నీ కొట్టివేత
- ట్యాంక్‌బండ్ ఘటనపై నిందితుల జాబితా నుంచి విముక్తి
- దీర్ఘకాల న్యాయ పోరాటానికి ముగింపు

**హైదరాబాద్, ఏప్రిల్ 24:**
2011లో జరిగిన మిలియన్ మార్చ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్

మిగతా 2వ పేజీలో..



## 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

8,500 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
ఇప్పటికే 5,000 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాలు
ఎప్పటికప్పుడు ధాన్యాన్ని తరలించేందుకు రవాణ వసతి
మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 24 :**
రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే 20 జిల్లాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం

మిగతా 3వ పేజీలో..





3

## కవిత కొత్తపార్టీ ఆవిర్భావం నేడు


## టికెట్ ఏదైనా యాప్ ఒక్కటే

- మీ టికెట్ యాప్ ద్వారా సరళమైన సేవలు

**హైదరాబాద్, ఏప్రిల్ 24:**
వీకెండ్ సరదాగా ఫ్యామిలీతో బయటకు వెళ్లాలనుకుంటున్నారా.. మెట్రోలో ప్రయాణం... టెంపుల్ విజిట్, ఏదైనా పార్క్.. లేదంటే

మిగతా 3వ పేజీలో..



3

## ఎంఎస్‌పీ భారాన్ని రాష్ట్రాలపై మోపొద్దు

'మద్దతు' ప్రకటించిన పంటలన్నింటినీ కేంద్రమే కొనాలి
వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల డిమాండ్
ఖరీఫ్‌కు అందుబాటులో ఉంచాల్సిన విత్తనాలపై సమీక్ష




## తెలంగాణలో ఐపీఎస్ అధికారుల బదిలీలు

- కీలక పోస్టుల్లో మార్పులు
- పలువురు ఉన్నతాధికారులకు కొత్త బాధ్యతలు
- విజిలెన్స్, ఇంటెలిజెన్స్ విభాగాల్లో కీలక నియామకాలు
- పోలీసు వ్యవస్థలో పునర్వ్యవస్థీకరణ

3



2

## శంకర్ గౌడ్ ఆత్మహత్య బాధాకరం

ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే
కేంద్ర మంత్రి బండి సంజయ్

# ఆర్టీసీ సమస్యలపై ప్రభుత్వం సానుకూలం

- సమ్మెపై జెఎసితో మంత్రుల చర్చలు
- ఆర్టీసీని బలోపేతం చేద్దామన్న భట్టి

**హైదరాబాద్, ఏప్రిల్ 24:**
ఆర్టీసీ సమ్మెపై చర్చలు కొలిక్కి వచ్చినట్లేనని భావిస్తున్నారు. ప్రభుత్వం కూడా కార్మికుల పట్ల సానుకూలతతో ఉన్నట్లు సమాచారం. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రుల బృందం భేటీ కొనసాగుతోంది. ఈ సమావేశంలో మంత్రులు

మిగతా 2వ పేజీలో..





3

## హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్

- ఏడుగురు ఐపీఎస్‌ల బదిలీలు

## ఆర్టీసీ సమ్మెలపై ప్రభుత్వం సానుకూలం

**మొదటిపేజీ తరువాయి**

పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ డ్రైవర్ శంకర్ గౌడ్ మంత్రి చాలా బాధాకరమని పేర్కొన్నారు. ఇలాంటి విషాదకర ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు.ఆర్టీసీని మనం బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది. బీఆరఎస్ పాలనలో ఆర్టీసీ చిన్నాభిన్నమైంది. అప్పటి పాలకులు ఎంత కఠినంగా వ్యవహరించారో మీకందరికీ తెలుసు. గత పాలకుల మాదిరిగా మేము వ్యవహరించబోం. ఆర్టీసీకి సంబంధించిన పాలన, విధానపరమైన నిర్ణయాలపై చర్చిద్దాం.కార్మికుల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించు కుందామని భట్టి అన్నారు. మొత్తం 32 డిమాండ్లను జేఏసీ నేతలు మంత్రుల ముందు ఉంచారు. ఇప్పటికే 29 డిమాండ్లపై సానుకూలంగా ఉన్నామని మంత్రి పొన్నం ప్రకటించిన నేపథ్యంలో.. మూడు కీలక డిమాండ్లపై మంత్రులు, జేఏసీ నేతలు చర్చిస్తున్నారు. ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘాలకు గుర్తింపు, పీఆర్సీపై చర్చలు కొనసాగుతున్నాయి. ఆర్టీసీ బోర్డు పరిధిలోని సమస్యలను యాజమాన్యం, ఉద్యోగులు పరిష్కరించుకోవాలని.. ప్రభుత్వ పరిధిలోని అంశాలను పరిష్కరిస్తామని మంత్రులు తెలిపారు.



## శంకర్ గౌడ్ మృతి విషాదకరం

- **ఈ బలిదానం తీవ్రంగా కలచివేసింది**
- **మాజీ మంత్రి హరీష్ రావు ఆవేదన**

**హైదరాబాద్, ఏప్రిల్ 24:**

ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు స్పందించారు. శంకర్ గౌడ్ ఆత్మ బలిదానం తీవ్రంగా కలిచివేసిందంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స' వేదికగా మాజీ మంత్రి పోస్ట్ చేశారు. శంకర్ గౌడ్ మృతికి సీఎం రేవంత్ రెడ్డిదే బాధ్యత అని అన్నారు. శంకర్ గౌడ్ అమరుడైన రోజును అపాయింటెడ్ డేగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. 'ఆర్టీసీ కార్మిక సోదరుడు శంకర్ గౌడ్ ఆత్మబలిదానం తమ హృదయాలను తీవ్రంగా కలిచివేసింది.. సంస్థను కాపాడేందుకు, కార్మికుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన శంకర్ గౌడ్‌కు తమ ఘన నివాళులు. హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాడాలి తప్ప, ఇలాంటి ఆత్మ బలిదానాలకు ఎవరూ ఒడిగట్టవద్దని హృదయపూర్వకంగా మనవి చేస్తున్నాం. శంకర్ గౌడ్ మృతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే బాధ్యత. ప్రభుత్వ అలసత్వం, నిర్లక్ష్యం వల్ల ఇలాంటి పరిస్థితి వచ్చింది. అధికారంలోకి రాగానే ఆర్టీసీ విలీన పక్రియను పూర్తి చేస్తామని, ఇతర అన్ని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి మాట తప్పడం వల్లనే ఈ దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలు కూడా అమలు చేయకుండా ఇంకెన్నాళ్లు కాలం గడుపుతావు రేవంత్ రెడ్డి? ఇలా ఎంత మందిని బలి తీసుకుంటావు అని ప్రశ్నించారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన ఆవేదనను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభించి, కార్మికుల్లో విశ్వాసం కల్పించాలన్నారు. ఆర్టీసీ కార్మిక సోదరుల్లారా.. మీ పోరాటానికి మేమంతా అండగా ఉన్నాం.. అధైర్యానికి లోనుకాకండి. కలిసికట్టుగా, న్యాయబద్ధంగా పోరాడి మన హక్కులను సాధించుకుందాం.. ఎలాంటి తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని మరోసారి మనవి చేస్తున్నాం.. జోహార్ శంకర్ గౌడ్' అంటూ హరీ ష్ రావు పోస్ట్ చేశారు.

## ఆర్టీసీ కార్మికులకు
# రేవంత్ తీరని ద్రోహం

**హైదరాబాద్, ఏప్రిల్ 24:**

ఆర్టీసి డ్రైవర్ శంకర్ గౌడ్‌ది ఆత్మహత్య కాదు.. అది ముమ్మాటికీ రేవంత్ సర్కారు చేసిన హత్యే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రెండున్నరేళ్లుగా సీఎం రేవంత్ ఆర్టిసి కార్మికులకు చేస్తున్న తీరని ద్రోహాన్ని తట్టుకోలేకే శంకర్ గౌడ్ బలవన్మరణానికి పాల్పడ్డారన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణకు, తోటి కార్మికుల హక్కుల సాధనకు ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ శంకర్ గౌడ్ పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు తీసుకెళ్లి నివాళులర్పించేందుకు కూడా అనుమతించకపోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని కేటీఆర్ మండిపడ్డారు. పుట్టెడు దుఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు అండగా నిలిచిన బీఆరఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితోపాటు, బీఆరఎస్ నేతలు, ఆర్టీసీ కార్మికులు, కార్మిక సంఘాల నేతలను నర్సంపేటలో అరెస్టు చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో అక్రమంగా అరెస్టు చేసిన వారందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు రాక్షసత్వం వల్ల కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అలాగే శంకర్ గౌడ్ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అన్నివిధాలా ఆదుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్నా కనీసం సోయి లేని సర్కారు అంతులేని నిర్లక్ష్యం వల్లే ఇవాళ ఉద్యమం నాటి దృశ్యాలు, ఆత్మబలిదానాలు చోటుచేసుకునే పరిస్థితులు చూస్తున్నామని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల వేళ సవాలక్ష హామీలిచ్చిన రేవంత్ రెడ్డి కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా నెరవేర్చకపోవడంతోనే ఆర్టీసీ కార్మిక లోకం ఇవాళ తీవ్ర నిరాశానిస్పృహల్లో కొట్టుమిట్టాడుతోందని ఆయన అన్నారు. ఆర్టీసిని నిర్వీర్యం చేసే కుట్రలను ఇకనైనా మానుకుని కార్మికులతో చర్చలు జరిపి, ఇచ్చిన హామీలను, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఒకేరోజు ముగ్గురు ఆర్టీసీ డ్రైవర్లు ఆత్మహత్యా యత్నాలు చేసిన సంఘటన తెలంగాణ చరిత్రలో ఓ చీకటి రోజుగా మిగిలి పోతుందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ సర్కారులో కనీసం చలనం లేకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఆర్టీసీ కార్మిక సోదరుల్లారా.. దయచేసి మనోధైర్యాన్ని కోల్పోకండి. పోరాటాలకు బీఆరఎస్ పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుంది అని భరోసా ఇచ్చారు. ఈ నిరంకుశ కాంగ్రెస్ సర్కారు, ఈ అసమర్థ ముఖ్యమంత్రి మెడలు వంచి ఆర్టీసీ కార్మికుల న్యాయమైన హక్కులను సాధించే వరకూ మనమంతా సంఘటితంగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు.

## మిలియన్ మార్చ్ కేసులో
## కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు భారీ ఊరట

**మొదటిపేజీ తరువాయి**

ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావులకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై జరిగిన ఈ ఘటనకు సంబంధించి నమోదైన కేసులను హైకోర్టు పూర్తిగా కొట్టివేసింది. మిలియన్ మార్చ్ సందర్భంగా ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ సమయంలో పోలీసులు పలు కేసులు నమోదు చేసి, కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను కూడా నిందితులుగా చేర్చారు. ఈ కేసులు దీర్ఘకాలంగా న్యాయస్థానాల్లో విచారణలో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పిటిషనర్ల తరపు న్యాయవాది కోర్టులో కీలక వాదనలు వినిపించారు. సంఘటనలతో తమకు ప్రత్యక్ష సంబంధం లేదని, రాజకీయ కారణాలతోనే కేసుల్లో తమ పేర్లు చేర్చారని వివరించారు. ఆధారాలు లేకుండా కేసులు నమోదు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. వాదనలు, పత్రాలను పరిశీలించిన హైకోర్టు న్యాయస్థానం ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని తేల్చింది. దీంతో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులపై నమోదైన కేసులను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. ఈ నిర్ణయం వారికి గణనీయమైన ఉపశమనాన్ని కలిగించింది. దీంతో సంవత్సరాలుగా కొనసాగుతున్న న్యాయపరమైన వ్యవహారం ముగిసినట్లయింది. ఈ కేసులు రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకున్న నేపథ్యంలో హైకోర్టు తీర్పు చర్చనీయాంశంగా మారింది. ఈ తీర్పు తర్వాత బీఆర్ఎస్ వర్గాల్లో సంతృప్తి వ్యక్తమవుతుండగా, రాజకీయంగా కూడా ఈ పరిణామం ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఆర్టీసీ సమ్మెకు బలైన శంకర్‌గౌడ్

**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్రంలోని అనేకచోట్ల కార్మికులు నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలోనే నర్సంపేట ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నిరసన చేపట్టగా శంకర్‌గౌడ్ శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. ఆయనను వెంటనే వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే 80 శాతం కాలినగాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతిచెందారు. మరోవైపు శంకర్ గౌడ్ బలవన్మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం, మనోబలం కలగాలని ప్రార్థించారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబాన్ని దు:ఖసాగరంలో ముంచిందని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరుపుతున్నదని, వారి సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేస్తున్నదని గుర్తు చేశారు. శంకర్ గౌడ్ మృతి పట్ల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి పభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఆర్టీసీ కార్మికులు ఆందోళన చెందవద్దని, క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

**మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి**

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఒక కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని కోల్పోవడం ఎంతటి బాధో మాటల్లో చెప్పలేం.. వారి కుటుంబానికి ఈ దుఃఖ సమయంలో ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుంది అని తెలిపారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం కలగాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నానన్నారు. ఇలాంటి సమయంలో ఆర్టీసీ సోదరులు ఆవేశానికి లోనవ్వకుండా ముందుకు సాగాలని కోరారు. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు మరిన్ని కుటుంబాలను బాధలోకి నెట్టకూడదు.. మీ సమస్యలు మా సమస్యలే.. మీ బాధ మా బాధే.. ఆర్టీసీ కుటుంబం సురక్షితంగా, బలంగా ఉండాలని తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది.. మీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్చల ద్వారా శాశ్వత మార్గం కనుగొనేందుకు సిద్ధంగా ఉంది.. ఈ క్లిష్ట సమయంలో మీరు ధైర్యంగా ఉండాలి.. ప్రభుత్వం మీతోనే ఉంది అని సీతక్క స్పష్టం చేశారు.

**బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ సంతాపం**

ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ మరణించడం పట్ల బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ సంతాపం తెలిపారు. ఆర్టీసీ కార్మికులు తమ డిమాండ్లను ఆమోదించాలని సమ్మె చేస్తున్న తరుణంలో నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్‌గౌడ్ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ తన ప్రాణాలను కోల్పోవడం విషాదకరం. ఆయన మృతిపట్ల సంతాపాన్ని వ్యక్తం చేస్తూ ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని తెలిపారు. శోకంలో మునిగిన ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని పార్థిస్తున్నానన్నారు. ఎవరూ ఈ రకమైన చర్యలకు పాల్పడి తమ కుటుంబాలకు అన్యాయం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. శంకర్‌గౌడ్ మృతి వార్త తెలిసిన రాష్ట్ర ప్రభుత్వం మంత్రుల కమిటీ ద్వారా చర్చలు జరుపుతోందని, వారి డిమాండ్‌లను పరిష్కరించడానికి ఒక పరిష్కారం లభిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నానన్నారు. శంకర్‌గౌడ్ కుటుంబాన్ని వెంటనే ఆదుకోవడానికి ఎక్స్‌గ్రేషియాతోపాటు ఇతర చర్యలను ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



**శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు మంత్రి పొన్నం పరామర్శ**

అంతకుముందు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న శంకర్‌గౌడ్‌ను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చూసి వెళ్లారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామన్నారు. ఆర్టీసీ కార్మికులు ఎవరూ అధైర్యపడవద్దని, మీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని, ఎవరూ అఘాయిత్యాలకు పాల్పడవద్దని మరోసారి విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఆర్టీసీ కార్మికులు మా కుటుంబ సభ్యులే.. మేమూ కిందిస్థాయి కార్మికవర్గం నుండి వచ్చిన వాళ్ళమే. కార్మికులకు అండగా ఉంటాం అని తెలిపారు. గతంలో సమ్మెలు జరిగితే పదుల సంఖ్యలో చనిపోయినా ఏ ఒక్క మంత్రీ వచ్చి కనీసం చూసి కూడా పోలేదన్నారు. కార్మికుల పట్ల తమ ప్రభుత్వానికి బాధ్యత ఉందని, వాళ్ళు తమ సోదరులు.. వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# శంకర్ గౌడ్ అంత్యక్రియల్లో ఉద్రిక్తత

- **ముత్తోజీపేట చేరిన కేంద్ర మంత్రి బండి సంజయ్**
- **మృ తదేహాన్ని నర్సంపేట డిపోకు తరలించాలని కోరిన కుటుంబీకులు**
- **నివాళి అర్పించే అవకాశాన్ని కల్పించాలని కోరిన కార్మికులు**
- **రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలున్నందున ససేమిరా అన్న పోలీసులు**
- **పోలీసుల తీరుపై కేంద్ర మంత్రి ఆగ్రహం**
- **ప్రభుత్వ ఆదేశాలతో శంకర్ గౌడ్ కుటుంబం, జేఏసీ నాయకులతో చర్చలు**
- **ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ**
- **ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరిస్తామని భరోసా**
- **శాంతించిన కుటుంబ సభ్యులు, జేఏసీ నేతలు**
- **మొదలైన శంకర్ గౌడ్ అంత్యక్రియలు**



**నర్సంపేట, ఏప్రిల్ 24 :**

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ అంత్యక్రియల్లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. శంకర్ గౌడ్ భౌతిక కాయాన్ని నర్సంపేట ఆర్టీసీ డిపోకు తరలించాలన్న కుటుంబ సభ్యుల, ఆర్టీసీ కార్మికుల విజ్ఞప్తిని పోలీసులు తిరస్కరించడంతో తీవ్ర ఆందోళన మొదలైంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శంకర్ గౌడ్ భౌతిక కాయానికి నివాళి అర్పించేందుకు నర్సంపేట మండలం ముత్తోజీపేటలోని ఆయన నివాసానికి వచ్చారు. తమ విజ్ఞప్తిని పోలీసులు పట్టించుకోవడం లేదని కుటుంబీకులు చెప్పడంతో రంగంలోకి దిగిన కేంద్ర మంత్రి పోలీసులతో మాట్లాడారు. నర్సంపేట డిపోలో 22 ఏళ్లపాటు శంకర్ గౌడ్ సేవలందించినందున ఆ డిపో వద్దకే భౌతిక కాయాన్ని తరలించి ఆయనను కడసారి చూసి నివాళలర్పించే అవకాశాన్ని సహచర ఆర్టీసీ కార్మికులను అనుమతించాలని కోరారు. నర్సంపేట డిపోకు తరలిస్తే శాంతిభద్రతలు తలెత్తుతాయని, ముత్తోజీపేటలోనే త్వరగా అంత్యక్రియలు జరపాలని ప్రభుత్వ ఆదేశాలున్నాయని పోలీసులు చెప్పారు. దీంతో సంజయ్ పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం మానవత్వం లేకపోతే ఎట్లా.. కుటుంబ సభ్యుల విజ్ఞప్తిని, సహచర కార్మికుల ఆకాంక్షను పట్టించుకోకపోతే ఎట్లా అని ప్రశ్నించారు. లా అండ్ ఆర్డర్ బాధ్యత రాకుండా నేను చేసుకుంటా.. డెడ్‌బాడీని నర్సంపేట డిపోకు తీసుకెళ్లేందుకు అనుమతించండి అని చెప్పారు. అయినా పోలీసులు ససేమిరా అనడంతో శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులు రోదిస్తూ పోలీసుల తీరుపై మండిపడ్డారు. అదే సమయంలో బీజేపీ శ్రేణులు, ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని పోలీసుల తీరును నిరసిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డౌన్ డౌన్, ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం దొంగల రాజ్యం, దోపిడి రాజ్యమంటూ నినాదాలు చేశారు. శంకర్ గౌడ్ భౌతిక దేహాన్ని వారంతా కలిసి ఇంట్లో నుండి బయటకు తీసుకొచ్చారు. భౌతిక కాయాన్ని నర్సంపేటకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకుని రోడ్డుపైనే శంకర్ గౌడ్ భౌతిక కాయాన్ని నిలువరించడంతో పోలీసులకు, బీజేపీ శ్రేణులకు, ఆర్టీసీ కార్మికుల మధ్య చాలాసేపు తోపులాట జరిగింది. పోలీసుల తీరును నిరసిస్తూ కేంద్ర మంత్రి మండుటెండలో నడిరోడ్డుపైనే శంకర్ గౌడ్ భౌతిక కాయం వద్ద కూర్చుని నిరసన తెలిపారు. దీంతో భారీ ఎత్తున తరలివచ్చిన ప్రజలు, బీజేపీ కార్యకర్తలు, ఆర్టీసీ కార్మికులు పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో అక్కడి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దాదాపు గంటపాటు పోలీసులకు, బీజేపీ శ్రేణులకు మధ్య పెనుగులాట జరిగింది. కోపోద్రిక్తులైన బీజేపీ శ్రేణులు, ఆర్టీసీ కార్మికులు శవ పేటికను పక్కకు తోసి శంకర్ గౌడ్ డెడ్ బాడీని తీసుకుని అంబులెన్స్‌లోకి ఎక్కించారు. అంబులెన్స్ కదులుతుండగా మళ్లీ పోలీసులు అడ్డుకుని డెడ్‌బాడీని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దీంతో పట్టరాని కోపంతో బీజేపీ శ్రేణులు, ఆర్టీసీ కార్మికులు, శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులు పోలీసులకు, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ దాదాపు మూడు గంటలకుపైగా రోడ్డుపైనే బైఠాయించారు. దీంతో వరంగల్ మల్లంపేట రహదారి పూర్తిగా స్తంభించింది. అయినా పోలీసుల ససేమిరా అనడంతో విసిగిపోయిన శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులు 'మీరే అంత్యక్రియలు నిర్వహించుకోండి. ఎలా చేస్తారో చూస్తాం' అంటూ కేంద్ర మంత్రి సంజయ్ వాహనంలోనే కూర్చుండిపోయారు. దీంతో వరంగల్ పోలీస్ కమిషర్ సన్‌ప్రీత్ సింగ్ హుటాహుటిన అక్కడికి చేరుకుని కేంద్ర మంత్రితో చర్చలు జరిపారు. సమయం మించిపోతోందని, అంత్యక్రియలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. వెంటనే కేంద్ర మంత్రి స్పందిస్తూ శంకర్ గౌడ్ అంత్యక్రియల విషయంలో ఆయన కుటుంబ సభ్యుల, ఆర్టీసీ జేఏసీ నేతల నిర్ణయమే ఫైనల్.. వారు ఏం చెబితే దానికి మేం అంగీకరిస్తాం.. దయచేసి రెచ్చగొట్టి ఇబ్బందులు స□ష్టించొద్దు అని కోరారు. ఈ నేపథ్యంలో శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులతో, ఆర్టీసీ జేఏసీ నాయకులతో పోలీసులు చర్చలు జరిపారు. అదే సమయంలో ప్రభుత్వ పెద్దలతో ఫోన్‌లో మాట్లాడించారు. శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులను అన్ని విధాలా ఆదుకుంటామని, నష్ట పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లపై చర్చలు జరుగుతున్నాయని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని భరోసా ఇచ్చారు. దీంతో శాంతించిన కుటుంబ సభ్యులు, జేఏసీ నాయకులు శంకర్ గౌడ్ అంత్యక్రియలను నిర్ణయించి కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు తెలియజేయడంతో వారికి ఏ ఇబ్బందులు లేకుండా అంత్యక్రియలు నిర్వహించాలని పోలీసులకు చెప్పిన బండి అక్కడినుండి కరీంనగర్ కు తిరుగుపయనమయ్యారు.

**ప్రభుత్వానికి అంత పట్టింపులెందుకు**

ముత్తోజీపేటకు రాగానే తొలుత కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'శంకర్ గౌడ్ డెడ్ బాడీతో పోలీసుల రాజకీయాలేంది.. నర్సంపేట డిపో ఏమైనా పాకిస్తాన్‌లో ఉందా.. కాంగ్రెస్ ప్రభుత్వానికి అంత పట్టింపులెందుకు.. శంకర్ గౌడ్ డెడ్ బాడీని పోలీసులు తీసుకెళ్లి ఏం చేసుకుంటారు.. శంకర్ గౌడ్ భౌతిక దేహాన్ని నర్సంపేట ఆర్టీసీ డిపో వద్ద ఉంచి నివాళి అర్పించాలన్నది కుటుంబ సభ్యుల కోరిక. 22 ఏళ్ల అనుబంధమున్న ఆర్టీసీ డిపో వద్ద శంకర్ గౌడ్ భౌతిక కాయాన్ని కడసారి చూసి నివాళి అర్పించాలన్నది ఆర్టీసీ కార్మికుల ఆకాంక్ష. ఆర్టీసీ డిపో వద్ద శంకర్ గౌడ్ డెడ్ బాడీని ఐదు నిమిషాలు ఉంచేలా అనుమతించాలని కోరితే ఇంత గొడవ ఉండేది కాదు కదా అని అన్నారు. శాంతిభద్రతల సమస్యే ఉండదు.. ఐదు నిమిషాలు ఆర్టీసీ డిపో వద్ద ఉంచాలని చెప్పినా పట్టించుకోకపోతే ఎలా.. శంకర్ గౌడ్ ఇంటి ముందు టెంట్ వేసిన వాళ్లను సైతం పోలీసులు బెదిరిస్తున్నారు.. మేం చెప్పినట్లు వినకపోతే బెన్‌ఫిట్స్ కూడా ఇవ్వబోమని శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులను బెదిరిస్తున్నారు. చివరకు శంకర్ గౌడ్ కొడుకును కొట్టి స్టేషన్‌కు తరలించారు. ఇంతకంటే దారుణం ఏమైనా ఉందా.. ఆర్టీసీ కార్మికులు ఏమైనా దొంగలా.. లంగలా___ తమ సహచరుడిని కడసారి చూసుకుందామనుకుంటే ఎందుకు అనుమతించడం లేదు.. అని మండిపడ్డారు. కుటుంబ సభ్యులు, జేఏసీ నాయకులతో చర్చల అనంతరం మళ్లీ మీడియాతో మాట్లాడుతూ శంకర్ గౌడ్ అంత్యక్రియల విషయంలో నేను మొదటి నుండి ఆర్టీసీ జేఏసీ, శంకర్ గౌడ్ కుటుంబ సభ్యుల నిర్ణయానికే వదిలేశాం. వాళ్లు మాట్లాడుకుని అంతిమ యాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. శంకర్ గౌడ్ కు సొంత ఇల్లు కూడా లేదు. ప్రభుత్వం చేసే రూ.10 లక్షల సాయం దేనికి పనికొస్తుంది.. శంకర్ గౌడ్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలి. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి.. అని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఆర్టీసీ కార్మికులెవరూ ఆత్మహత్యలకు పాల్పడొద్దని కోరుతున్నా. ఆర్టీసీ కార్మికులకు యుద్ధం కొత్త కాదు. సకల జనుల సమ్మెలో ఆర్టీసీ కొట్లాడితేనే తెలంగాణ వచ్చింది. డిమాండ్ల సాధనలోనూ కొట్లాడాలే తప్ప ఆత్మహత్యలు చేసుకోవద్దు.

# శంకర్ గౌడ్ ఆత్మహత్య బాధాకరం

- **ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే**
- **కేంద్ర మంత్రి బండి సంజయ్**

**కరీంనగర్, ఏప్రిల్ 24:**

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య బాధాకరమని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు.. ఇది ప్రభుత్వ హత్య అంటూ వ్యాఖ్యానించారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం బెదిరిస్తోందని ఆరోపించారు. ఇంత పెద్ద సమ్మె జరిగితే.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ సర్కార్ చేసిన తప్పే కాంగ్రెస్ చేస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వంలో కూడా ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టో 28వ పేజీలో ఆర్టీసీని విలీనం చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. రెండు పీఆర్సీలు చెల్లిస్తామని హామీ ఇచ్చారంటూ ఆ మేనిఫెస్టోను కేంద్ర మంత్రి చదివి వినిపించారు. ఆర్టీసీ సమస్యలపై బీజేపీ పోరాడితే ఓటు కాంగ్రెస్‌కు వేశారన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో కోత విధిస్తే ఎంత వస్తుంది.. ఆ డబ్బులు బనీలు కొనుక్కోవడానికి కూడా సరిపోవు.. ఢిల్లీకి పైసల మూటలు పంపడం ఆపితే కార్మికులకు డబ్బులు ఇవ్వొచ్చు అంటూ సర్కార్‌కు కేంద్ర మంత్రి చురకలంటించారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు తెలంగాణ నుంచే డబ్బులు వెళ్తున్నాయని ఆరోపించారు. మేనిఫెస్టోను ప్రధాని మోదీని అడిగి తయారు చేశారా అంటూ కాంగ్రెస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.



## ఎంఎస్‌పీ భారాన్ని రాష్ట్రాలపై మోపొద్దు

**హైదరాబాద్, , ఏప్రిల్ 24 :**

కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌పీ ప్రకటించి పంటలను కొనే బాధ్యతను మాత్రం రాష్ట్రాలపై వేస్తున్నదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల విమర్శించారు. దీంతో రాష్ట్రంపై అధిక భారం పడుతోందని తెలిపారు. ఎంఎస్‌పీ ప్రకటించిన ప్రతీ పంటను కేంద్రమే కొనుగోలు చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. సచివాలయంలో వ్యవసాయ శాఖ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, కమిషన్ సభ్యులతో శుక్రవారం సమావేశమైన మంత్రి తుమ్మల వచ్చే ఖరీఫ్ సీజన్ కోసం అందుబాటులో ఉంచాల్సిన వరి రకాల ఎంపిక, విత్తన లభ్యత, సాగు ప్రణాళికలపై వ్యవసాయ శాఖ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారులు వచ్చే ఖరీఫ్ సీజన్ కోసం బీపీటీ5024, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరాం, కేఎ న్ ఎం 1638, డబ్ల్యూజీఎల్ 44, డబ్ల్యూజీఎల్ 962, జేజీఎల్ 1798, మరికొన్ని సన్న రకాలను సిద్ధం చేసినట్లు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఏడాది 33 రకాల సన్న రకాలను అందుబాటులో ఉంచడం వల్ల రైతులు అమ్మకాల సందర్భంలో ఇబ్బందులు ఎదుర్కొన్నట్టు, కొన్నింటికి బోనస్ కూడా రాకుండా ఇబ్బందులుపడ్డారని ప్రభుత్వం దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ సంవత్సరం అలాంటి సమస్యలు రాకుండా పరిమిత రకాలు, రైతులకు అధిక దిగుబడి ఇచ్చే రకాలు అందుబాటులో ఉంచడంపై దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. సివిల్ సప్లై అధికారులతో సమన్వయం చేసుకుని రాష్ట్రం, కేంద్రం కొనుగోలు చేసే పరిమాణాల ఆధారంగా విత్తనాల సరఫరా ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 4 నుండి 9 వరకు జరిగే రైతు ఉత్సవాల కార్యక్రమంలో మే 4న ఈ విత్తనాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. మే 15 కల్లా ఎంపిక చేసిన విత్తన రకాలను రైతులకు సిద్ధంగా ఉంచాలని అధికారులకు చెప్పారు. అధిక దిగుబడి, మార్కెట్లో డిమాండ్ ఉన్న విత్తనాలనే అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. సీడ్ కార్పొరేషన్ ద్వారా ఈ విత్తనాలను సరఫరా చేయడంతోపాటు, ప్రైవేట్ కంపెనీలు కూడా ఇదే రకాల విత్తనాలను అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు. ఇందుకోసం విత్తన కంపెనీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని వ్యవసాయ శాఖ కార్యదర్శికి సూచించారు. వచ్చే మంగళవారం జరిగే రైతు నేస్తం కార్యక్రమంలో కూడా ఇదే విషయంపై చర్చించాలని సూచించారు. ఈ రకాలతో రైతులకు మేలు జరగాలని, ప్రభుత్వం ఏయే పంటలను కొనాలనుకుంటుందో రైతులు ముందుగానే తెలుసుకునేలా వివరాలు అందుబాటులో ఉంచాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే ఎంఎస్‌పీ శాస్త్రీయంగా లేదని, కేంద్ర ప్రభుత్వ విధానాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని కోద□ండరెడ్డి అన్నారు. ఎంఎస్‌పీ విషయంలో రైతు సంఘాల, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను కేంద్రం పట్టించుకోలేదన్నారు. మంత్రి మాట్లాడుతూ కేంద్రం కేవలం ఎంఎస్‌పీ ప్రకటనలకే పరిమితమైందని విమర్శించారు. ధర ప్రకటించి ఏమీ పట్టనట్టు ఉంటోందని, రైతులకు ఆ ధర అందుతుందో, లేదో చూడట్లేదని అన్నారు. బహిరంగ మార్కెట్‌లో కూడా ఎంఎస్‌పీ అందేవిధంగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, దీంతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. తెలంగాణ వంటి రాష్ట్రాలలో రైతులు మద్ధతు ధర రాకుండా నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో రైతుల వద్ద నుండి మద్ధతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నదని, దీంతో ప్రభుత్వంపై అదనపు భారం పడుతోందని అన్నారు. ఏటా ప్రభుత్వంపై రూ.2000 నుండి రూ.3000 కోట్లు అదనంగా భారం పడుతున్నదని, అయినప్పటికీ కేంద్రం నుండి ఎలాంటి సహకారాలు అందడం లేదని అన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కొత్త డిస్కమ్ కోటి అనుమానాలు !

- **విధానాలపై స్పష్టతలేదు - విధులు ఎలా సాధ్యం**
- **99 విద్యుత్ సంస్కరణల్లో ఉద్యోగ భద్రతుంది .**
- **ఉద్యోగుల అనుమానాల నివృత్తి చేస్తూ చట్టం సైతం ఏర్పాటైంది.**
- **అసలు ఈ డిస్కమ్ ఏర్పాటు ఎందుకు**
- **వినియోగదారులకు ఒనగూరే ప్రయోజనం ఏంటి ?**
- **ఉన్నత పదవుల్లో ఉన్నవారికి ఇంకేం పదోన్నతి లభిస్తుంది.**
- **పదవీవిరమణ పొందాక ప్రయోజనాలు ఎక్కడి నుండి ఇస్తారు.**
- **ప్రభుత్వం తో జరగాల్సిన చర్చ యాజమాన్యం చేస్తుందా ?**



**తెలంగాణ బ్యూరో ,ఏప్రిల్ 24:**

రైతు డిస్కామ్ పై ఉద్యోగులతో జరిగిన సమావేశం పరిష్కారం లేని సమస్యగానే మిగిలిపోయింది. అసలు రైతు డిస్కామ్ ఎందుకన్న ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా , ఉద్యోగులు అందులోకి వస్తే పదోన్నతులంటూ భ్రమపెట్టడంపై ఉద్యోగ సంఘాల నేతలు మండిపడ్డారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న రైతు డిస్కామ్ పై శుక్రవారం సీఎండీ ముషారఫ్ ఉద్యోగసంఘాల నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అసలు రైతు డిస్కామ్ ఎందుకని అది తెలియకుంటే అక్కడికి ఉద్యోగుల బదిలీలు ఎలా సాధ్యం అని సీఎండీ ముషారఫ్ ను ఉద్యోగ సంఘాల నేతలు ప్రశ్నించారు మండలానికి ఇద్దరితో పనులు సాధ్యమా ?అని ప్రశ్నించారు.

కొత్తగా ఏర్పాటు చేస్తున్న "రైతు డిస్కం"పై ఉద్యోగుల పంపిణీ, బాధ్యతల కేటాయింపులపై స్పష్టత ఇవ్వకుండా ఎలా ప్రారంభిస్తారని వారు ప్రశ్నించారు.ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 600 మండలాల్లో ఉన్న 5 లక్షలకు పైగా ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ బాధ్యతలను కొత్త రైతు డిస్కం చేపడుతుందని తెలిపారు. అయితే, ఈ నిర్వహణకు ఎంతమంది ఉద్యోగులను బదిలీ చేస్తారనే విషయంపై స్పష్టత ఇవ్వాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఒక్కో మండలానికి ఇద్దరు ఉద్యోగులను మాత్రమే నియమిస్తే పనులు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు.

కొత్త డిస్కంలో చేరే ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తామని సీఎండీ పేర్కొన్నప్పటికీ, అవి ఏ ప్రాతిపదికన ఇస్తారో వివరించాలన్నారు. అలాగే, కొత్త డిస్కం వల్ల ఉద్యోగులు, వినియోగదారులకు కలిగే లాభాలేమిటో వివరించాలని కోరారు.

జెన్‌కోకు ఇవ్వాల్సిన రూ.25 వేల కోట్ల బకాయిలను ఎవరు చెల్లిస్తారు? లైన్ల పంపిణీ ఎలా జరుగుతుంది? వంటి కీలక అంశాలపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు.

దీనిపై స్పందించిన సీఎండీ ముషారఫ్ ఫరూఖీ మాట్లాడుతూ, "ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అన్ని ప్రక్రియలు పారదర్శకంగా నిర్వహిస్తాం" అని హామీ ఇచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు రైతు డిస్కంను ఏర్పాటు చేస్తోందని, జూన్ 2 నాటికి పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రాథమికంగా సుమారు 2000 మంది ఉద్యోగులతో డిస్కం ప్రారంభమవుతుందని, అవసరాన్ని బట్టి సిబ్బందిని పెంచే అవకాశం ఉందన్నారు. ఉద్యోగుల జీతభత్యాలు, నిబంధనలు ఇతర డిస్కంల మాదిరిగానే ఉంటాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సుమారు 65 మంది ఉద్యోగ సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు కొత్తగా ఏర్పాటు చేస్తున్న "రైతు డిస్కం"పై ఉద్యోగుల పంపిణీ, బాధ్యతల కేటాయింపులపై స్పష్టత ఇవ్వకుండా ఎలా ప్రారంభిస్తారని టీజీఎస్పీడీసీఎల్ ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు సీఎండీ ముషారఫ్ ఫరూఖీని నిలదీశారు.ఒక్క మండలానికి ఇద్దరు ఉద్యోగులతో పని సాధ్యమేనా అని వారు ప్రశ్నించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 600 మండలాల్లో ఉన్న 5 లక్షలకు పైగా ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ బాధ్యతలను కొత్త రైతు డిస్కం చేపడుతుందని తెలిపారు . కొత్త డిస్కంలో చేరే ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తామని సీఎండీ పేర్కొన్నప్పటికీ, అవి ఏ ప్రాతిపదికన ఇస్తారో వివరించాలన్నారు. అలాగే, కొత్త డిస్కం వల్ల ఉద్యోగులు, వినియోగదారులకు కలిగే లాభాలేమిటో వివరించాలని కోరారు.జెన్‌కోకు ఇవ్వాల్సిన రూ.25 వేల కోట్ల బకాయిలను ఎవరు చెల్లిస్తారు? లైన్ల పంపిణీ ఎలా జరుగుతుంది? వంటి కీలక అంశాలపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు. దీనిపై స్పందించిన సీఎండీ ముషారఫ్ ఫరూఖీ మాట్లాడుతూ, "ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అన్ని ప్రక్రియలు పారదర్శకంగా నిర్వహిస్తాం" అని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు రైతు డిస్కంను ఏర్పాటు చేస్తోందని, జూన్ 2 నాటికి పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రాథమికంగా సుమారు 2000 మంది ఉద్యోగులతో డిస్కం ప్రారంభమవుతుందని, అవసరాన్ని బట్టి సిబ్బందిని పెంచే అవకాశం ఉందన్నారు. ఉద్యోగుల జీతభత్యాలు, నిబంధనలు ఇతర డిస్కంల మాదిరిగానే ఉంటాయని స్పష్టం చేశారు.

**మండలానికి ఇద్దరే ఉద్యోగులట ?**

కొత్తగా ఏర్పాటు చేస్తున్న రైతు డిస్కామ్ లో వినియోగదారులకు ఇక మండలానికి ఇద్దరే సేవలందిస్తారట. ఇది ఆ డిస్కామ్ సీఎండీ చెప్పిన మాట. ఒక్కో మండలానికి వేలసంఖ్యలో కనక్షన్స్ ఉంటాయి.అలాంటప్పుడు ఇద్దరే ఎలా వారికీ సేవలందించగలరన్నది ఉద్యోగసంఘాల నేతల ప్రశ్న!

**99 విద్యుత్ సవరణ చట్టం అమలు చేయాలి**

కొత్త డిస్కామ్ ఏర్పాటు చేయాలన్న ఆత్రుత తప్ప ఉద్యోగుల భద్రత, వినియోగదారులకు ఏ మేర ప్రయోజనం అన్నది స్పష్టత లేదు. కొత్త డిస్కామ్ వెళ్ళాక ఉద్యోగులకు ఇచ్చిన హామీ నెరవేరకపోతే వాళ్ళ పరిస్థితి ఏంటన్నది నేతలు అడుగుతున్న ప్రశ్న. బ్యూరోక్రాట్స్ ఇచ్చే హామీలు వాళ్ళు బదిలీ అయ్యాక ఉండవు కదా అలాంటపుడు అభిప్రాయాలు మంత్రివర్గ ఉపసంఘము ఏర్పాటు చేసి చేయాలన్నది ఉద్యోగ సంఘాల నేతల వాదన. ఒక డేట్ పెట్టుకొని ఆ రోజు ప్రారంభిస్తామని నిర్ణయించుకుంటే ఉద్యోగులు

మాత్రమే ఎంతవరకు సహకరించగలరు అని నేతలు పేర్కొంటున్నారు. ఏదో ఏదో మమ అనిపించుకుందామన్నట్టు పెట్టిన అభిప్రాయం సేకరణ సమావేశం కాస్త జవాబు లేని ప్రశ్నలకు కారణమవ్వడంతో రైతు డిస్కామ్ సీఎండీ నివ్వెరపోయారు.

## 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

**మొదటిపేజీ తరువాయి**

చేరుతుండడంతో కొనుగోళ్లు ప్రారంభం అయ్యాయని సాగు ఆలస్యం అయినందున మరో 13 జిల్లాల్లో కొనుగోలు పక్రియ ఇంకా మొదలు పెట్టలేదని ఆయన పేర్కొన్నారు. రబీ సీజన్లో ధాన్యం కొనుగోళ్ల పక్రియపై శుక్రవారం రోజున డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సచివాలయంలో పౌర సరఫరాల శాఖాధికారులతో ఉన్నత స్థాయి సవి□క్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, అడిషనల్ డైరెక్టర్ రోహిత్ సింగ్ డిప్యూటీ కమిషనర్ కొండల్ రావు,జెనరల్ మేనేజర్ ధాన్యం కొనుగోళ్లు,గ□నాన్స్,మార్కెటింగ్ లతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధాన్యం ఉత్పత్తి రికార్డు స్థాయిలో పెరిగినందున అదే స్థాయిలో ముందెన్నడూ లేని రీతిలో ఈ రబీ సీజన్ లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందన్నారు.ధాన్యం కొనుగోలుకు గాను రాష్ట్ర వ్యాప్తంగా 8,500 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఇప్పటికే 5,000 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. 20 జిల్లాల్లో ఇప్పటికే ధాన్యం కొనుగోలు పక్రియ ప్రారంభం అయ్యిందని,సాగు ఆలస్యం అయినందున మరో 13 జిల్లాలో కొనుగోలు పక్రియ ఇంకా మొదలు పెట్టలేదన్నారు. క్షేత్ర స్థాయి నుండి వస్తున్న సమాచారం ప్రకారం రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రానుందున అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరిపి అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ఇప్పటి వరకు నాలుగు లక్షల 89 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు ఆయన తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ ఉంచేందుకు గాను 12 లక్షల మెట్రిక్ టన్నులు నిలువ ఉంచేందుకు వీలుగా గోదాములు గుర్తించామని,మరో 20 లక్షల బాయిల్డ్ రైస్ ను నిలువ ఉంచేందుకు గాను జిల్లాల వారీగా కేటాయింపులు జరిపినట్లు ఆయన తెలిపారు.అంతే గాకుండా ధాన్యం కొనుగోలుకు గాను కొనుగోలు కేంద్రాలలో 16 కోట్ల గన్ని బ్యాగులను అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తేమను త్వరితగతిన కొలిచేందుకు వీలుగా ప్యాడి క్లినర్లు,□డైయర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఎక్కడ కుడా ఆలస్యం జరగకుండా చూసేందుకు గాను సరిపడా హమాలిలను నియమించాలన్నారు. తూకం పక్రియలో ఎటువంటి పొరపాట్లు దొర్ల కుండా చూసుకోవడంతో పాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆయా ప్రాంతంలో ఉన్న మిల్లులకు తరలించేందుకు రవాణా ఏర్పాట్లను మరింత బలోపేతం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

## టికెట్ ఏదైనా యాప్ ఒక్కటే

**మొదటిపేజీ తరువాయి**

గోల్కొండ ఫోర్ట్, మ్యూజియం సందర్శించాలనుకుంటున్నారా.. పిల్లలకు సెలవులొచ్చాయి కానీ.. ఎండాకాలం అని భయపడుతున్నారా.. తీరా అక్కడికి వెళ్లాక టికెట్ కౌంటర్, క్యూ లైన్ అని వెనక్కు తగ్గుతున్నారా..ఇప్పుడా అవసరం లేదు. స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు. జస్ట్ ఒక్క క్లిక్‌తో వీకెండ్ ప్లాన్ అంతా సాఫీగా సాగిపోతుంది. మీ స్మార్ట్ ఫోన్ ద్వారా సింపుల్‌గా ప్లే స్టోర్ నుంచి మీ టికెట్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని మన ప్రయాణ టికెట్లు సహా విజిటింగ్ ప్లేస్ టికెట్లు కూడా ఇంటి దగ్గరి నుంచే బుక్ చేసుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ఐటీ శాఖ పరిధిలో ఉన్న 'మీ సేవ' ద్వారా తెచ్చిన ఈ మీ టికెట్ యాప్ ఇప్పుడు ఎన్నో సర్వీసులను మీ అరచేతిలో ఉన్న ఫోన్ ద్వారా పొందే సౌకర్యాన్ని కల్పిస్తోంది. బస్, మెట్రో ప్రయాణ టికెట్లు మొదలు, టెంపుల్స్, పార్కులు, మ్యూజియం, ఫారెస్ట్ సఫారీ సందర్శన ఇలా చాలా రకాల సౌకర్యాలు, వాటి టికెట్లను అక్కడి క్యూ లైన్‌తో సంబంధం లేకుండా నేరుగా మనమే బుక్ చేసుకోవచ్చు. ఒకవేళ మీరు మీ ఎలక్ట్రిక్ కారులో ప్రయాణిస్తే సమీపంలో ఉన్న చార్జింగ్ స్టేషన్ లోకేషన్‌ను కూడా ఈ యాప్ ద్వారా తెలుసుకునే వెసలుబాటు ఉంది. ఇలా ఇండోర్, అవుట్ డోర్ యాక్టివిటీస్‌తోపాటు వివిధ సేవలను ఒకే యాప్ ద్వారా అందించటమే 'మీ టికెట్' లక్ష్యం. ప్రవేశపెట్టిన కొద్ది రోజుల్లోనే ఈ యాప్ మంచి ప్రజాదరణ పొందుతోంది. ఇప్పటికే సుమారు రెండున్నర లక్షల మంది ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఆరు లక్షలకుపైగా సేవలను పౌరులు బుక్ చేసుకున్నారు. రూ.4 కోట్లకుపైగా విలువైన లావాదేవీలు సురక్షితంగా జరిగాయి. వివిధ ప్రభుత్వ శాఖలు నిర్వహించే 219 లోకేషన్లలో ఈ మీ టికెట్ యాప్ ద్వారా అక్కడి సేవలకు సంబంధించిన ప్రవేశటికెట్లను నేరుగా యాప్‌లోనే ప్రజలు పొందుతున్నారు. టికెట్ ఏదైనా.. యాప్ ఒక్కటే నినాదంతో ఈ మీటికెట్ యాప్ ప్రజాదరణ పొందుతోంది. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని సేవలను ఈ యాప్ పరిధిలోకి తీసుకొస్తామని, ఐటీ సేవలను పౌరసమాజం నిత్య జీవితంలో మరింతగా వాడుకునేలా విస్తరిస్తామని సమాచార సాంకేతిక శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు.

## యువర్ సిటీ 100 యాప్‌లో సమగ్ర సమాచారం

**కాళోజి జంక్షన్/హనుమకొండ, ఏప్రిల్ 24 :**

సమాజంలో వ్యాపార అవకాశాలను విస్తృత పరుచుకోవడానికి యువర్ సిటీ 100 యాప్ సాంకేతికత పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పులి అవినాష్ రూపొందించిన యాప్‌ను కేటీఆర్ చేతుల మీదుగా హైదరాబాదులో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారుల నుంచి అగ్రశ్రేణి వ్యాపారుల వరకు తమ సమాచారాన్ని తమ వింతలు, విశేషాల సమగ్ర సమాచారం యువర్ సిటీ 100 యాప్ ద్వారా పొందవచ్చన్నారు. అమెరికాలోని బొట్సిన్ ఎల్ సి సితో కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌తో కుదుర్చుకున్న ఎంఓయూ ద్వారా రాజా నరేందర్ రెడ్డి నేతృత్వంలోని సెంటర్ ఫర్ ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, రీసెర్చ్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ తో కలిసి ఆధునిక సాంకేతిక యాప్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్టు అవినాష్ తెలిపారు. ఈ సందర్భంగా 'కిట్స' వరంగల్ చైర్మన్ కెప్టెన్ వి.లక్ష్మీకాంత రావు, కోశాధికారి పి.నారాయణ రెడ్డి, కార్యదర్శి వొడితల సతీష్ కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.అశోక రెడ్డిలు అధ్యాపకులను అభినందించారు.




## తెలంగాణలో ఐపీఎస్ అధికారుల బదిలీలు

**హైదరాబాద్, ఏప్రిల్ 24**

తెలంగాణలో పలువురు ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేస్తూ కీలక పోస్టుల్లో మార్పులు చేపట్టింది. పరిపాలన సామర్థ్యాన్ని మెరుగుపర్చే దిశగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం. ఈ బదిలీల్లో భాగంగా శిఖా గోయల్‌ను హోమ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమించారు. దేవేంద్ర సింగ్ చౌహాన్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు అప్పగించారు. షాహ్నవాజ్ ఖాసిం ఐజీపీగా మల్టీ జోన్2కి పోస్టింగ్ ఇవ్వగా, తరుణ్ జోషిని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్‌గా నియమించారు. అవినాష్ మొహంతిని డ్రగ్స్ కంట్రోల్ అండ్ ఎక్సైజ్ డీజీగా బదిలీ చేశారు. సుమతిని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా నియమించగా, కార్తికేయకు ఎస్ఐబీ ఇంటెలిజెన్స్ విభాగంలో అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక పలు అధికారులకు అదనపు ఛార్జ్ బాధ్యతలను కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మార్పులతో పోలీసు శాఖలో సమన్వయం, కార్య నిర్వహణ మరింత బలోపేతం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. పోలీసు వ్యవస్థలో సమర్థతను పెంచడం, విభాగాల పనితీరును మెరుగుపరచడం లక్ష్యంగా ఈ బదిలీలు చేపట్టినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

## హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్

- **ఏడుగురు ఐపీఎస్‌ల బదిలీలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 24:**

రాష్ట్రంలో ఏడుగురు సీనియర్ ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీఎస్ రామకృష్ణా రావు ఉత్తర్వులు జారీ చేశారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్ నియమితులయ్యారు. విజిలెన్స్ డీజీగా డీఎస్ చౌహాన్ బదిలీ అయ్యారు. మల్టీ జోన్I2 ఐజీగా షానవాజ్ ఖాసిం నియమితులయ్యారు. ఆయన పోలీసు పర్సనల్ ఐజీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి నియమితులయ్యారు. డ్రగ్స్ కంట్రోల్ డీజీగా అవినాష్ మొహంతిని నియమిస్తూ ఆయనకు ఏసీబీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక మల్కాజిగిరి పోలీసు కమిషనర్‌గా బి.సుమతి, ఐజీ కార్తికేయకు ఎసఐబీ ఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

# కవిత కొత్తపార్టీ అవిర్భావం నేడు


**హైదరాబాద్:**

తెలంగాణలో మరో కొత్త పార్టీ ఆవిర్భవించబోతున్నది. బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కూతురుగా ప్రపంచానికి పరిచయమైన కల్వకుంట్ల కవిత నేడు శనివారం కొత్తగా రాజకీయ పార్టీని ప్రారంభించబోతున్నారు. బిఆర్ఎస్ పార్టీనుండి సస్పెండ్ అయిన దాదాపు ఎనిమిది నెలలకే ఆమె స్వంతంగా ఒక రాజకీయ పార్టీని నెలకొల్పబోతున్నారు. ఈ పార్టీ విషయంలో ఇప్పటివరకు రాష్ట్రంలోని ఇతర రాజకీయ పార్టీలు, ముఖ్యంగా అధికార కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు పెద్దగా పట్టించుకోకపోయినా, ఇప్పుడు ఆ పార్టీలు దీర్ఘాలోచనలో పడ్డాయి. ఆమె పార్టీ పెట్టడంవల్ల నష్టపోయేది ఎవరన్నది కొద్ది కాలంగా రాష్ట్రంలో చర్చ జరుగుతున్నది. మొదటగా బిఆర్ఎస్‌కు అది గొడ్డలిపెట్టుగా మారనున్నదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూసినప్పటి నుండి బిఆర్ఎస్ అధినే కెసిఆర్ కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో లేడన్న విషయం బాగా ప్రచారంలోఉంది. ముఖ్యమైన శాసనసభ సమావేశాలకు కూడా హాజరు కాకపోవడం, ఆ పార్టీ నుండి పలువురు ఎంఎల్‌ఏలు నిష్క్రమిస్తున్నా పెద్దాయన పెద్దగా చలించకపోవడం ఆ పార్టీ నేతల్లో కొంత నైరాశ్యానికి కారణమైంది. దానికి తగినట్లుగా కవిత ఎపిసోడ్ ఆ పార్టీ ప్రతిష్టను మరింత దిగజార్చింది. ఢిల్లీ లిక్కర్ కేసులో కవిత జైల్ జీవితం అనుభవించడం, ఆమె పార్టీలో జరుగుతున్న విషయాలు, సరిదిద్దుకోవాల్సిన అంశాలపై పార్టీ అధినేత కెసిఆర్‌కు రాసిన లేఖ బహిర్గతం కావడం, దానిపై కవిత పార్టీలోని ముఖ్యనాయకులపై విరుచుకుపడడం, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నదంటూ ఆమెను సస్పెండ్ చేయడం తదితర విషయాలు ఆ పార్టీ మనుగడకు ప్రశ్నార్థకంగా మారాయి. దానికి తగినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ పార్టీపైన, పార్టీ అధినేత కెసిఆర్‌పైన చేస్తున్న మాటల దాడి, మోపుతున్న కేసులు ఇబ్బందికరంగా మారాయి.

ఇదిలాఉంటే ఇటీవల కాలంలో కవిత సాక్షాత్తు తండ్రి కెసిఆర్ తాజా బహిరంగసభ ప్రసంగంపైన తీవ్రంగా విరుచుకుపడడం లాంటి సంఘటనలు బిఆర్ఎస్ పార్టీ క్యాడర్ తమ భవిష్యత్‌పై ఆలోచించుకోవడానికి కారణంగా మారుతున్నాయి. శనివారం ప్రకటించనున్న పార్టీ పేరును కవిత నిగూడంగా ఉంచడం ఆసక్తిని కలిగిస్తున్న మరో అంశం. ఎందుకంటే తెలంగాణ రాష్ట్ర సాధనలో ముఖ్యభూమిక నిర్వహించిన టిఆర్ఎస్ తర్వాత బిఆర్ఎస్‌గా మారింది. అయితే ఆ టిఆర్ఎస్‌ను ఎవరైనా తమ పార్టీకి వాడుకోవచ్చంటూ కవిత చేసిన ప్రకటన కూడా చర్చనీయాంశంగా మారింది. నిజంగానే కవిత తన పార్టీకి ఆ పేరు పెట్టుకున్నట్లు అయితే బిఆర్ఎస్‌కు మరింత ఇబ్బందకరంగా మారనుందన్నది నిజం. ఆ భయంతోనే బిఆర్ఎస్ క్యాడర్ మళ్ళీ తమ పార్టీ టిఆర్ఎస్‌గానే మారుతుందన్న లీకులిచ్చారు. ఏది ఏమైన కవిత పార్టీ పెట్టడం ఖాయమైపోయింది. ముహూర్తంకూడా సిద్దమైంది. మేడ్చల్ జిల్లా మునీరాబాద్ సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్వాగత తోరణంపైన 'తెలంగాణ ప్రజా వికాస్ సమితి' అని పేరుంది. అంటే టిపిఎస్‌గా పార్టీపేరు పిలవబడుతుందా అన్న ఆలోచన ఒకటి కలుగుతోంది. వాస్తవానికి 'తెలంగాణ ప్రజా జాగృతి'గా ఆమె తన పార్టీకి నామకరణం చేసే అవకాశాలున్నట్లుగా ఇంతకాలం చర్చ జరుగుతున్నది. కాని టిపిఎస్ అంటే 1969లో తెలంగాణ ప్రజా సమితి (టిపిఎస్) మాదిరిగా ప్రజల్లోకి ఆ పేరు దూసుకు వెళ్తుందను కుంటుందనుకుంటున్నారు. తాజగా మీడియా అడిగిన ప్రశ్నకు కూడా ఆమె తినబోతూ రుచిఎందుకని దాటవేశారు. నాలుగుపదులు దాటిన కవిత తన రెండవ ఇన్నింగ్‌ను ప్రారంభించబోతున్నది. ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అయిన కవిత తన తండ్రి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంకోసం చేస్తున్న పోరాటంలో భాగస్వామిని కావాలని 2006లో విదేశంనుండి భారత్‌కు తిరిగి వచ్చి ఉద్యమంలో తన వంతు పాత్ర నిర్వహించింది. తనకంటూ ప్రత్యేక గుర్తింపు కోసం తెలంగాణ జాగృత్తి పేర సాంస్కృతిక, సామాజిక సంస్థను ఏర్పాటు చేసింది. ప్రధానంగా నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణను ఇవ్వడంతోపాటు, తెలంగాణ సాంస్కృతిక పునర్జీవనానికి కృషిచేసింది. ముఖ్యంగా ఉద్యమంలో భాగంగా తెలంగాణ సంస్కృతి ప్రతిబింభమైన బతుకమ్మను విశ్వవ్యాపితం చేసింది. నల్లమల అడవుల్లోని చెంచు గిరిజన జీవనోపాధి, ప్రకృతి పరిరక్షణ తదితర విషయాలపై తన వంతు కృషిచేసింది. వివిధ ట్రేడ్ యూనియన్‌లకు గౌరవ అధ్యక్షురాలిగా కొనసాగిన కవిత తర్వాతి కాలంలో పార్లమెంటు సభ్యురాలుగా, ఎంఎల్సీగా కొనసాగారు. ఢిల్లీ కుంభకోణంలో భాగస్వామి అయిందన్న ఆరోపణపై ఆమె జైలుకు వెళ్ళడం, అనంతరం పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తన తండ్రి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు రాసిన లేఖ బహిర్గతం కావటం, దానిపై ఆమె పార్టీలోని ముఖ్యనేతలపై తీవ్రస్థాయిలో బహిరంగ ఆరోపణ చేయడం ఫలతంగా 2025 మే 2న సస్పెండ్‌కు గురైనారు. అప్పటినుండి తానే ఒక రాజకీయ పార్టీని ఏర్పాటుచేస్తానని ప్రకటించి కవిత నేడు దానికి శ్రీకారం చుట్టబోతున్నారు.

పార్టీలో చేరబోయే ప్రముఖ్యులెవరు : వివిధ పార్టీలకు చెందిన అనేకులు తమ పార్టీలో చేరేందుకు ఉత్సాహం చూపిస్తున్నారని గత కొద్దికాలంగా కవిత పేర్కొంటున్న విషయం తెలిసిందే. అయినప్పటికీ ఇంతవరకు ప్రముఖుల పేర్లేవి వినిపించడంలేదు. ముందుగానే చెప్పినట్లు పార్టీ ఆవిర్భావం రోజున చేరికలుండకపోవచ్చు. కాని ఆ పార్టీవైపు మొగ్గు చూపేది ఎవరన్న చర్చమాత్రం బాగానే జరుగుతున్నది. అధికార కాంగ్రెస్ పార్టీని తీవ్రంగా విమర్శిస్తున్నా కవిత టార్గెట్ అంతా బిఆర్ఎస్ పైనే ఉన్నట్లు తెలుస్తున్నది. ఆ పార్టీకి చెందిన మాజీ ఎంఎల్ఏలు, సీనియర్ నాయకులు తమ టచ్‌లో ఉన్నారని ఆమెతో సహా ఆ పార్టీ నేతలు లీకులిస్తూనే ఉన్నారు.తెలంగాణ అస్థిత్వమే పునాదిగా, అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తమ పార్టీ పనిచేస్తుందని చెబుతున్న కవిత, మారుతున్న కాలానికి అనుగుణంగా తెలంగాణను మరింత ముందుకు తీసుకుపోవడమే తమ లక్ష్యంగా చెబుతున్నది. ముఖ్యంగా తమ పార్టీలో యువతకే అధిక ప్రాధాన్యమివ్వనున్నట్లు ఆమె గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే. కేవలం ఒక ప్రాంతానికో, కులానికో, మతానికో చెందిన వారు కాకుండా అందరికి సమాన ప్రాతినిధ్యాన్ని కల్పిస్తామంటున్నారు కవిత. ఇప్పటికైతే విశ్వకర్మ రాష్ట్ర సహకార సంఘం నేత తాటికొండ శ్రీనివాసాచారి జాగృతిలో చేరారు. పార్టీ కార్యాలయంలో ఆయనకు కండువ కప్పి కవిత స్వాగతించారు. బోథ్ ఎంఎల్ఏ రాథోడ్ బాపురావు కవితను కలిసినవారిలో ఉన్నారు. పార్టీ ఆవిర్భావం తర్వాత తమ పార్టీలోకి క్యూ కట్టే అవకాశాలున్నాయంటున్నాయి ఆ పార్టీ వర్గాలు.

శనివారం
ఏప్రిల్ 25, 2026
epaper.prajashankaravam.com
www.prajashankaravam.com
ప్రజా శంఖారావం
PRAJA SHANKARAVAM


## సంపాదకీయం

# ప్రజాప్రతినిధులకు జీతాలు ఎందుకు?

ఉద్యోగుల బకాయిలు ఆరువేల కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందని కేబినేట్ భేటీలో చర్చకు వచ్చింది. గత పదేళ్ల కెసిఆర్ పాలనలో, ఇప్పుడు రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో ఇవి అలాగే ఉండిపోయాయి. ఇంకా పెరిగి పోతున్నాయి. అయినా చీమకుట్టినట్లుగా లేదు. ఉచిత పథకాలకు, దుబారా ఖర్చులకు వెనకాడని ప్రభుత్వం ఉద్యోగుల విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యలే జీతాల్లో 50శాత ఇప్పుడు వీరికి చెల్లిస్తామని, వందరోజుల్లోగా బకాయిలు పూర్తిగాచెల్లిస్తామని మంత్రులు చెప్పు కొచ్చారు. అసలు మంత్రులు, ఎమ్మెల్యేలకు జీతాలు ఎందుకు? లక్షల్లో వారికి ఎందుకు చెల్లించాలి. ఎందుకు వారికి పెన్షన్లు చెల్లించాలన్నది ఆలోచించాలి. మందు వారి జీతాలను మొత్తంగానే ఆపేయాలి. పెన్షన్లను రద్దు చేయాలి. ప్రజాప్రతినిధులకు లక్షల్లో జీతాలు ఎందుకు? పేరున్న, డబ్బున్న వారు కూడా ఇప్పటికీ పెన్షన్లు పొందుతుననారు. ఎన్నికల సమయంలో ఉచితానుచితాలు మరచి ఎప్పటి కప్పుడు ఆకర్షణీయ పథకాలను గుప్పిస్తున్నారు. అధికారంలో లేన్నప్పుడు ఉచితాల గురించి విమర్శించినవారే, తీరా అధికారంలోకివస్తే అదే ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉచిత పథకాలను ఏకరువు పెడుతున్నారు. ఎన్నికల్లో విపరీతంగా డబ్బులు పంచి పెడుతున్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందదాని కన్నట్లు ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు. వీటివలన పేదలకు చెప్పుకోదగిన శాశ్వత ప్రయోజనం దక్కదు సరికదా, అత్యవసరంగా లాభపడేది పార్టీలు మాత్రమే. ప్రభుత్వాలు ఆర్థికంగా దివాలా కొడుతున్నాయి. జీతాలు ఇవ్వాలంటే మళ్ళీ అప్పులకు దేబిరించాల్సి వస్తోంది. ఉచిత పథకాలతో ప్రజలు సోమరులుగా మారి, పనిచేయడానికి ముందుకు రారని సుప్రీంకోర్టు చేసిన హెచ్చరికను ఎవరూ పట్టించు కున్నట్లు లేదు. అత్యున్నత ధర్మాసనం వ్యాఖ్యలను కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. ప్రజల బతుకులు బాగుపడే శాశ్వత ఆలోచన చేయడమే ప్రభుత్వ కర్తవ్యం కావాలి. ప్రస్తుత పరిస్థితులలో ఓటు కొనుక్కోకూడదు. ఓటు అమ్ముకోకూడదు అని చెబితే వినే వారెవరూ లేరు. దీనికితోడు ఉచిత పథకాలు రాష్ట్రాల, దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నా.. అధికారంలో ఉన్నవారు పట్టించుకోవడం లేదు. రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీస్తున్నా, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నా పట్టించుకోవడం లేదు. తెలంగాణలో ఇప్పుడు జీతాలు కూడా అప్పులు చేసి ఇవ్వాల్సి వస్తోంది.అధికారంలో ఉండగా తెలంగాణను అప్పుల్లో ముంచిన బిఆర్‌ఎస్ ఇప్పుడు విపక్షంలో ఉంటూ..మరిన్ని ఉచితపథకాల గురించి డిమాండ్ చేస్తున్నారు. తులం బంగారం ఇచ్చారా.. రైతుబంధు వేశారా..పెన్షన్లు నాలుగు వేలు ఇచ్చారా అంటూ నిలదీస్తున్నారు. గురుకులాలు అధ్వానంగా మారడానికి కాంగ్రెస్ కారణమన్నారు. నిజానికి గురుకులాలను లేదా హాస్టళ్లను ఒక్క గొడుగు కిందకు తీసుకుని రావాల్సి ఉంది. విద్య, వైద్యాలకు ఖర్చు చేయకుండా ఉచిత పథకాలకు చేస్తున్న ఖర్చులను వెంటనే ఆపకపోతే జీతాలు ఇవ్వలేరని తేలుతుంది. పెన్షనర్ల బకాయిలు చెల్లించడం లేదు. ఆర్టీసీ సమ్మెకు డబ్బులే కారణం. డబ్బులు ఇవ్వలేక, వారికి చెల్లింపులు చేయలేక,మహాలక్ష్మి పథకంతో దివాళా తీయిస్తూ, ఇవాళ ఆర్టీసీ సమ్మెలో ఓ కార్మికుడిని బలి తీసుకు న్నారు. శంకర్ గౌడ్ మృతి నిజానికి తీవ్ర విషాదం. తెలంగాణ ఉద్యమంలో కూడా ఇలాగే ఆత్మహత్య ల కు కాంగ్రెస్ కారణమయ్యింది. ముందుగా ఆర్టీసీ సమస్యను తేల్చాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. ఎపిలో జగన్ కూడా ఇదే తరహాలో బటన్ నొక్కుడు పథకాలతో దివాళా తీయించారు. చంద్రబాబు కూడా చేతిక ఎముక లేదన్నట్లుగా పథకాలను అందిస్తున్నారు. ఈ పథకాలు కొంపముంచుతున్నా ,రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఉచితాల పంపిణీలపై రాజకీయ నాయకులకు కనువిప్పు కావాలి. ప్రభుత్వం ద్వారా అన్నీ ఉచితంగా పొందాలనే మనస్తత్వం కారణంగా దేశంలో అభివృద్ధి కుంటుపడిపోతోంది. ఉచిత పథకాలకి ఖజానా ఖాళీ అయిపోతోంది. దానిని నింపడానికి మళ్ళీ అప్పులు. ఈ పద్దతి ఏ ప్రభుత్వానికీ మంచింది కాదు. లక్షల కోట్లు అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టలేక, ఉద్యోగుల జీతాలు కూడా భారమై ప్రభుత్వాలు నవ్వుల పాలవుతున్నాయి. జీతాలు కూడా చెల్లించ లేనప్పుడు మళ్లీ జనం నుంచే వసూలు చేయాలి. ఉచితాల పంపిణీ వలన జనంలో పేదరికం తగ్గిపోయిందని చెప్పడం అలవాటు చేసుకున్నారు. ముఖ్యంగా అధికారంలోకి రావడానికి అనేక విధాలుగా ఉచిత పథకాలపై హామీలు గుప్పిస్తూ, తీరా అధికారంలోకి వచ్చాక చేతులెత్తేయడం పరిపాటిగా మారింది. దీనిపై సుప్రీం ధర్మాసనం గట్టిగానే హెచ్చరించినా పట్టింపు లేదు. ఉచిత రేషన్, ఉచిత గ్యాస్, ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్ వంటివన్నీ ఖజానాను దివాళా తీయిస్తున్నాయి. ఎన్నికల సంఘం కూడా దీనిపై దృష్టి సారించాలి. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవడం మంచి పద్ధతి. ఉచితాలను అమలు చేస్తే ఎక్స్ ప్రెస్ వేలు, విమానాశ్రయాలు, రక్షణ కారిడార్లను నిర్మించచుకోలేం. విద్య, వైద్యం అందించలేం. ఉచితాల విషయమై రాజ్యాంగపరంగా నిషేధాలు విధించడం అవసరమేమో ఆలోచించాలి. భారతదేశ ఆర్థిక పరిస్థితిని ఆందోళనకర స్థాయికి తీసుకెళ్తాయని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ, ఎపిల అభివృద్ధికి ఉచిత పథకాలే అడ్డంకిగా మారాయి. తక్షణం వాటిని నివారించడంతో పాటు. ఈ బాధ్యతను కేంద్రప్రభుత్వమే తీసుకోవాలి. జీతాల చెల్లింపు లాంటి రోజువారీ కార్యక్రమాలను ఆపరాదు. అందుకోసం ముందుగా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపిల జీతభత్యాలను నిలిపివేసే పథకంతో ప్రారంభిస్తే మంచిది.

# ఆమ్‌ఆద్మీ పార్టీకి భారీ షాక్

- బీజేపీలో చేరుతున్న రాఘవచద్దా తదితరులు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:** ఆమ్‌ఆద్మీ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ రాజ్యసభ సభ్యుల్లో ముగ్గురు పార్టీకి గుడ్‌బై చెప్పి.. బీజేపీలో చేరబోతున్నారు. వీరిలో ప్రస్తుతం రాజ్యసభ ఆప్ డిప్యూటీ లీడర్ అశోక్ కుమార్ మిట్టల్ కూడా ఉన్నారు. ఇటీవలే రాఘవ్ చద్దాను రాజ్యసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవి నుంచి తొలగించిన ఆప్.. ఆయన స్థానంలో అశోక్ మిట్టల్‌ను నియమించింది. కానీ, ఇప్పుడు ఆయన కూడా పార్టీని వీడి బీజేపీలో చేరబోతున్నారు. ఈ విషయాన్ని ఆప్ రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ బహిష్కృత నేత రాఘవ్ చద్దా వెల్లడించారు. శుక్రవారం రాఘవ్ చద్దా, అశోక్ కుమార్ మిట్టల్, సందీప్ పాఠక్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తాము ఆమ్ ఆద్మీ పార్టీకి రాజీనామా చేసి, బీజేపీలో చేరబోతున్నట్లు వెల్లడించారు. రాజ్యసభలో మూడింట రెండొంతుల ఆప్ సభ్యులు కలిసి బీజేపీలో చేరబోతున్నట్లు ప్రకటించారు. అంటే రాజ్యాంగం ప్రకారం ఈ ముగ్గురూ కలిసి ఆమ్ ఆద్మీ పార్టీని బీజేపీలో విలీనం చేస్తారు. ఇలా ఒక సభలో ఒక పార్టీకి చెందిన మూడింట రెండు వంతుల మంది సభ్యులు.. అధికార లేదా వేరే ఏ పార్టీలోనైనా చేరవచ్చు.



ఇలా చేరితే, పార్టీ ఫిరాయింపుల చట్టం వర్తించదు. దీంతో ఈ ముగ్గురి రాజ్యసభ సభ్యత్వానికి ఢోకా లేకపోవచ్చు. ఇక, రాఘవ్ చద్దా, అశోక్, సందీప్.. ముగ్గురూ 2022 నుంచి ఆప్ తరఫున రాజ్యసభలో సభ్యులుగా కొనసాగుతున్నారు. తాజా మీడియా సమావేశంలో రాఘవ్ చద్దా మాట్లాడుతూ 'ఆమ్ ఆద్మీ పార్టీ కోసం 15 ఏళ్లపాటు చెమట, రక్తం చిందించాను. ఇప్పుడు ఆ పార్టీ తన సిద్ధాంతాలు, విలువలు, నైతిక అంశాల నుంచి పూర్తిగా పక్కకు తప్పుకొంది. ఆమ్ ఆద్మీ పార్టీ తన స్వార్థ ప్రయోజనాల కోసం తప్ప దేశం కోసం, జాతి ప్రయోజనాల కోసం పని చేయడం లేదు. ఇది చాలా మంది ఎప్పటినుంచో చెబుతున్నారు. ఇప్పుడు నేను కూడా అదే అనుకుంటున్నా. నేను సరైన పార్టీలో లేనని భావిస్తున్నా. సరైన వ్యక్తిని.. తప్పుడు పార్టీలో ఉన్నా. అందుకే ఈ రోజే ఆమ్ ఆద్మీ పార్టీకి దూరంగా ఉంటున్నా. ప్రజల కోసం వెళ్తున్నా' అంటూ ప్రకటించారు. తమతోపాటు స్వాతి మాలివాల్, హర్భజన్ సింగ్, రాజిందర్ గుప్తా, విక్రమ్‌జిత్ సింగ్ సహ్నే కూడా త్వరలో ఆప్‌ను వీడి బీజేపీలో చేరుతారు అంటూ రాఘవ్ వెల్లడించారు. అలాగే, తాను మోదీ, అమిత్ షా నాయకత్వంలో పని చేయబోతున్నట్లు వెల్లడించారు. తాజా సమాచారం ప్రకారం.. రాఘవ్ చద్దాకు కేంద్ర కేబినెట్‌లో మంత్రిగా చోటు దక్కే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

# సమయం మించిపోతోంది.. వెంటనే లొంగిపోండి!

- అణ్వాయుధాల అవసరం లేదు.. సంప్రదాయ యుద్ధంతోనే నాశనం చేస్తాం
- ట్రూత్ సోషల్‌లో అమెరికా అధ్యక్షుడి సంచలన పోస్ట్



**వాషింగ్టన్:** ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ సైన్యం ఇప్పటికే కుప్పకూలిపోయిందని, వారితో ఒప్పందానికి సమయం మించిపోతోందని స్పష్టం చేశారు. వైట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మరియు తన 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఇరాన్‌పై అణ్వాయుధాలు ప్రయోగిస్తారన్న వార్తలను ట్రంప్ కొట్టిపారేశారు. "నేను అణ్వాయుధాలను ఎందుకు ఉపయోగిస్తాను? అది లేకుండానే సంప్రదాయ యుద్ధ పద్ధతుల్లో వారిని ఇప్పటికే నాశనం చేశాం. అసలు ప్రపంచంలో ఎవరూ అణ్వాయుధాలను వాడటానికి అనుమతించకూడదు" అని ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో తూతూమంత్రంగా కాకుండా, దీర్ఘకాలికంగా ఉండే బలమైన ఒప్పందంపైనే తన దృష్టి ఉందని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ పాలకులకు తక్కువ సమయం ఉందని హెచ్చరిస్తూ ట్రంప్ ఒక పోస్ట్ పెట్టారు. "నాకు చాలా సమయం ఉంది, కానీ ఇరాన్‌కు లేదు. వారి నాయకత్వం బలహీనపడింది, సైన్యం చిన్నాభిన్నమైంది. మేము విధించిన ఆర్థిక, సైనిక దిగ్బంధనం అద్భుతంగా పనిచేస్తోంది. ఇకపై పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది" అని అందులో రాసుకొచ్చారు. హర్మూజ్ జలసంధిలో మైన్లు పెట్టి ఇరాన్ పెద్ద తప్పు చేసిందని ఆయన మండిపడ్డారు. ఇటీవల ఇరాన్ పతాకంతో ఉన్న ఒక వాణిజ్య నౌకను అమెరికా సీజ్ చేసిన ఉదంతంపై ట్రంప్ స్పందించారు. ఆ నౌకలో చైనా నుంచి ఇరాన్‌కు వెళ్తున్న ఒక 'బహుమతి' ఉందని, అయితే అది అత్యంత రహస్యమైన విషయం కావడంతో వివరాలు వెల్లడించలేనని ఆయన సస్పెన్స్ రేపారు. మరోవైపు ఇజ్రాయెల్ – లెబనాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణను మరో మూడు వారాల పాటు పొడిగిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఇరు దేశాల నాయకులు త్వరలోనే వైట్‌హౌస్‌లో సమావేశమై శాంతి చర్చలు జరిపే అవకాశం ఉందని వెల్లడించారు. మధ్యప్రాచ్యంలో శాంతి నెలకొనాలంటే ఇరాన్ తన పద్ధతి మార్చుకోవాలని ఆయన హితవు పలికారు.

# హుగ్లీ నదిలో ప్రధాని విహారం

- బెంగాలీల్లో గంగానదికి ప్రత్యేకత ఉంది
- ఎక్స్ వేదికగా ఫోటోలు పంచుకున్న మోడీ

**కోల్‌కతా, ఏప్రిల్ 24:** ప్రధాని నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్లో పర్యటిస్తున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని హుగ్లీ నదిలో బోట్ రైడ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా కెమెరాను చేతపట్టి నది అందాలను క్లిక్‌మనిపించారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. హుగ్లీ నది బెంగాల్ సంస్కృతితో ముడిపడి ఉందని మోదీ పేర్కొన్నారు. బెంగాలీల జీవితాల్లో గంగానదికి ఒక ప్రత్యేక స్థానం ఉందని, దాని జలాలు ఒక ప్రాచీన నాగరికత స్ఫూర్తిని మోసుకెళ్తాయన్నారు. ఈ రోజు ఉదయం హుగ్లీ నది తీరంలో కొంత సమయం గడిపినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో నదిలో పడవ నడిపేవారితో పాటు, ఉదయపు నడకకు వచ్చిన వారితో కాసేపు ముచ్చటించినట్లు తెలిపారు. పడవ నడిపేవారి శ్రామిక శక్తిని ఈసందర్భంగా మోదీ కొనియాడారు.



ఎన్నికల్లో గెలిపిస్తే.. పశ్చిమ బెంగాల్ అభివృద్ధికి, ప్రజల శ్రేయస్సు కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. హుగ్లీ నది ఒడ్డున తాను వెచ్చించిన సమయం చాలా ప్రత్యేకమైనదని మోదీ మరో పోస్టులో పేర్కొన్నారు. చరిత్రాత్మక విద్యాసాగర సేతు, హౌవ్‌డా వంతెనను దగ్గరగా చూడటం ఆనందంగా ఉందన్నారు.







# హిమాలయాల్లో 'హరహర మహదేవ' నామస్మరణ

- తెరుచుకున్న కేదార్‌నాథ్ ద్వారాలు!
- ఆరు నెలల విరామం తర్వాత జనసందోహం
- తొలిరోజే పోటెత్తిన యాత్రికులు
- చార్‌ధామ్ యాత్రలో ఆధ్యాత్మిక వైభవం..
- క్యూలైన్లలో తోపులాట, ఘర్షణ





**డెహ్రాడూన్, ఏప్రిల్24 :** గఢ్‌వాల్ హిమాలయాల పర్వత శ్రేణిలో కొలువైన పుణ్యక్షేత్రం కేదార్‌నాథ్ ఆలయం ఆరు నెలల సుదీర్ఘ శీతాకాల విరామం తర్వాత భక్తుల కోసం బుధవారం (ఏప్రిల్ 22) పునఃప్రారంభమైంది. అశేష భక్తజన సందోహం మధ్య బాబా కేదార్‌నాథ్ దేవాలయ ద్వారాలు తెరుచుకోవడంతో ఆలయ పరిసరాలు జనసంద్రంగా మారాయి. యాత్ర ప్రారంభమైన తొలిరోజే వేలాదిగా భక్తులు తరలి రావడంతో కొండ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయ దర్శనం కోసం భక్తులు భారీగా తరలి రావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. గంటల తరబడి వేచి ఉండాల్సి రావడంతో భక్తుల్లో అసహనం వ్యక్తమైంది. ఒకానొక దశలో కొందరు భక్తులు నిబంధనలు అతిక్రమించి ఒక క్యూలైన్ నుంచి మరో క్యూలైన్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో భక్తుల మధ్య వాగ్వివాదాలు, తోపులాటలు చోటు చేసుకున్నాయి. పరిస్థితిని అదుపు చేయడం భద్రతా సిబ్బందికి సవాలుగా మారింది. దీనికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఏప్రిల్ 19వ తేదీన అక్షయ తృతీయ సందర్భంగా గంగోత్రి, యమునోత్రి ఆలయాలను తెరవడంతో ఈ ఏడాది చార్‌ధామ్ యాత్ర అధికారికంగా ప్రారంభమైంది. ఏప్రిల్ 22న కేదార్‌నాథ్, ఏప్రిల్ 23న బద్రీనాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకున్నాయి. శీతాకాలంలో హిమపాతం అధికంగా ఉండటం వల్ల ఆరు నెలల పాటు మూసివేసిన ఈ క్షేత్రాలు, తిరిగి నవంబర్ 11వ తేదీ వరకు భక్తులకు దర్శనమివ్వనున్నాయి. హిమాలయాల్లో వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్న నేపథ్యంలో, యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉత్తరాఖండ్ ప్రభుత్వం మరియు దేవస్థాన కమిటీ విస్తృత ఏర్పాట్లు చేశాయి. వైద్య సదుపాయాలు, తాగునీరు మరియు వసతి సౌకర్యాలను పర్యవేక్షిస్తున్నారు. భక్తులు వాతావరణ పరిస్థితులను గమనించి యాత్రకు సిద్ధం కావాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రజా శంఖారావం
PRAJA SHANKARAVAM
శనివారం
ఏప్రిల్ 25, 2026
epaper.prajashankaravam.com
www.prajashankaravam.com

# కాళేశ్వరం కేసులో హైకోర్టు తీర్పు.. కాంగ్రెస్‌కు చెంపపెట్టు

- ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే కేసీఆర్ పై ఆరోపణలు
- రైతుల పక్షాన పోరాటం ఆపేది లేదు,
- తప్పుడు ప్రచారాలు మానుకోకపోతే గుణపాఠం తప్పదు
- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దొనకంటి నర్సయ్య



**భీంగల్, ఏప్రిల్ 24 (ప్రజా శంఖారావం):**

కాళేశ్వరం ప్రాజెక్టులో ఎటువంటి అవినీతి జరగలేదని, కేసీఆర్, హరీష్ రావుపై చర్యలు అవసరం లేదని హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి చెంపపెట్టులాంటిదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. భీంగల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య మాట్లాడారు. గత రెండున్నరేళ్లుగా కాళేశ్వరం ప్రాజెక్టుపై లక్ష కోట్ల అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఈ తీర్పు పూర్తిగా ఖండించిందన్నారు. ఈ నిర్ణయంతో తెలంగాణ ప్రజలకు, రైతులకు నిజాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ప్రాజెక్టుకు సుమారు రూ.94 వేల కోట్లు ఖర్చయిందని, లక్ష కోట్ల అవినీతి జరిగిందని చెప్పడం కాంగ్రెస్ నాయకుల అజ్ఞానానికి నిదర్శనమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే ఒక్క మేడిగడ్డ బ్యారేజ్ మాత్రమే కాదని, మూడు బ్యారేజీలు, 16 రిజర్వాయర్లు, 21 పంప్ హౌజ్‌లు, 19 సబ్‌స్టేషన్లు, 203 కి.మీ సొరంగాలు, 98 కి.మీ ప్రెజర్ మెయిన్స్, 1531 కి.మీ గ్రావిటీ కాలువలు, వేల కిలోమీటర్ల పిల్లకాలువలతో నిర్మించబడిందని వివరించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రివర్స్ పంపింగ్ (SRSP పునరుజీవం) వల్లే ఇటీవల నీటి సరఫరా నిలిచిపోయిన సమయంలో బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల ప్రాంతాల్లో పంటలు ఎండిపోకుండా కాపాడగలిగామని తెలిపారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి చొరవతో రైతులకు నీరు అందించగలిగామని చెప్పారు. రివర్స్ పంపింగ్ లేకుంటే వరద కాలువలకు నీళ్లు ఎక్కడి నుంచి వచ్చేవని కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. కాళేశ్వరం నీటితో కప్పల వాగులు నిండటంతో భీంగల్ పట్టణంలో త్రాగునీరు, సాగునీటికి కొదవ లేకుండా ఉందన్నారు. కేసీఆర్‌ను బద్నాం చేయడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టును నిరుపయోగం చేయాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. మేడిగడ్డ వద్ద కొద్ది పిల్లర్లు మాత్రమే దెబ్బతిన్నప్పటికీ వాటిని మరమ్మతు చేయకుండా రాజకీయ లబ్ధి కోసం ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికను కోర్టు తిరస్కరించడంతో బీఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టమైందన్నారు. ఈ తీర్పును తెలంగాణ రైతాంగ విజయంగా స్వాగతిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారాలు మానుకుని ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ జెడ్పీటీసీ చౌటుపల్లి రవి, మాజీ రైతు బంధు అధ్యక్షులు శర్మ నాయక్, మాజీ జిల్లా కోఆప్షన్ మెంబర్ మొయీజ్, మాణిక్యాల శ్రీనివాస్, మూడేడ్ల ప్రకాష్, కౌన్సిలర్లు మల్లెల ప్రసాద్, బోదిరె నర్సయ్య, గున్నాల భగత్, నీలం రవి, నాయకులు తోట శంకర్, సతీష్ గౌడ్, పర్స నవీన్, పతాని లింబాద్రి, ఎమ్మె సుర్జిల్, బచ్చగొని శ్రీనివాస్, రాజు నాయక్, డిష్ గంగాధర్, లింగం నాయక్, మూత లింబాద్రి, ఎస్పీ ప్రవీణ్, సిద్ధపల్లి రాములు, రాగుల అశోక్, మల్లెల శ్రీకాంత్, తోగిటి అరుణ్, గట్టు రతన్ రాజ్, కైత సాగర్, బోట్ల రామకృష్ణ, లద్దు, పత్రి దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ అవార్డు విజేత సుధీర్ బాబు




**ఆర్మూర్ ఏప్రిల్ 24(ప్రజా శంఖారావం):**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, మెదక్, నిర్మల్, లయన్స్ జిల్లా 320D పరిధిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ ప్రెసిడెంట్ అవార్డు కు మన ప్రాంతానికి చెందిన ప్రముఖ లయన్స్ సభ్యులు సుధీర్ బాబు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన లయన్స్ జిల్లా కన్వెన్షన్‌లో అంతర్జాతీయ ప్రెసిడెంట్ ఏ.పి.సింగ్ తరపున, పూర్వ అంతర్జాతీయ డైరెక్టర్, లయన్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ డాక్టర్ జి.బాబు రావు, డిస్ట్రిక్ట్ గవర్నర్ ఏ.అమర్‌నాథ్ రావు, చేతుల మీదుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. మొత్తం 142 క్లబ్‌లు ఉన్న జిల్లాలో కేవలం ముగ్గురు మాత్రమే ఈ అవార్డుకు ఎంపిక కాగా, ఉమ్మడి జిల్లాలైన కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, నిర్మల్ నుండి ఎంపికైన ఏకైక వ్యక్తిగా సుధీర్ బాబు గుర్తింపు పొందారు. గతంలో వీరు అంతర్జాతీయ ప్రెసిడెంట్ లీడర్‌షిప్ మెడల్ కూడా అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా లయన్స్ నాయకులు, స్థానిక ప్రముఖులు, బంధు మిత్రులు వారిని అభినందించారు.

## పసుపు రైతులకు సన్మానం



**ఆర్మూర్, ఏప్రిల్ 24(ప్రజా శంఖారావం):**

నాణ్యమైన పసుపు పంట రైతుకు మంచి ఆదాయం ఇవ్వగలిగే ముఖ్యమైన పంటల్లో ఒకటి పసుపు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఔషధ గుణాలు కలిగి ఉండటం వల్ల మార్కెట్లో ఎప్పుడూ మంచి డిమాండ్ ఉంటుంది. అందువల్ల సరైన పద్ధతుల్లో పసుపు సాగు చేస్తే అధిక దిగుబడితో పాటు మంచి లాభాలు పొందవచ్చు. నిజామాబాద్ జిల్లా మెండోరా గ్రామంలో కార్విన్ అగ్రి సైన్స్ కంపెనీ వారి ఉత్పత్తులు వాడి అధిక దిగుబడులు పొందిన రైతన్నలకు కంపెనీ ప్రతినిధులు దోండి రమణ, శాలువా, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. కార్విన్ కంపెనీ వారి సాయిల్ పవర్ కిట్ వాడి అధిక దిగుబడులు తీసిన అల్లూరి గంగారెడ్డి, తుమ్మల గంగాధర్ రెడ్డి, ఏనుగు లింగారెడ్డి, నూతపల్లి లింగారెడ్డి, కొప్పుల ముత్యంరెడ్డి, భూక్య సంతోష్, ఏనుగు శంకర్ రెడ్డి, అన్న గారి శ్రీనివాస్, బడల సాయి రెడ్డిలు మాట్లాడుతూ పసుపు నాణ్యత కొమ్ముఁరడం మంచి కురుకుమిన్ శాతం పెరగడం దుంపకుళ్ళు నివారణ తదితర విషయాలపై వాళ్ళ అభిప్రాయాలు పంచు కుంటూ ఇంత మంచి ఉత్పత్తులను అందించిన కార్విన్ కంపెనీ వారికి ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమం రైతు డిపో కృష్ణవంశీ, అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో నవీన్, ఆసిఫ్ పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్ రద్దు నినాదంతో మేడే నిర్వహించాలి



**ఆర్మూర్, ఏప్రిల్ 24 (ప్రజా శంఖారావం):**

కార్మికులు పోరాడి సాధించుకున్న మేడే దినోత్సవాన్ని లేబర్ కోడ్స్ రద్దు చేయాలనే డిమాండ్‌తో జరుపుకోవాలని ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు, ఉపాధ్యక్షుడు శివాజీ పిలుపునిచ్చారు. మామిడిపల్లిలో శుక్రవారం ఐఎఫ్టియు ఆధ్వర్యంలో మేడే గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మిక వ్యతిరేకమని విమర్శించారు. 12 గంటల పని విధానాన్ని అమలు చేయాలన్న ప్రయత్నం కార్మిక హక్కులకు విరుద్ధమన్నారు. కార్మికులను రక్షించే విధానాలకంటే పెట్టుబడిదారులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. వందేళ్ల పోరాటంతో సాధించిన హక్కులను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక కోడ్ల అమలు కార్మికుల జీవన విధానంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. కార్మికులు ఐక్యంగా పోరాడి తమ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మేడే అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమిస్తేనే కార్మికులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ మేడే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు నాయకులు అబ్దుల్, బాలయ్య, లక్ష్మి, భానుచందర్, గంగాధర్, నరేందర్, పటేల్, వర్ణా రెడ్డి, పోచన్న, సాయన్న, రషీద్, చిట్టక్క, ధనలక్ష్మి, సర్వర్ లక్ష్మి పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24 (ప్రజా శంఖారావం):**



ఆర్టీసీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వామపక్ష పార్టీలు హెచ్చరించాయి. ఆర్టీసీ సమ్మెకు మద్దతుగా సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వివిధ వామపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయడం లేదని విమర్శించారు. రెండేళ్లు గడిచినా విలీనంపై స్పష్టత లేకపోవడం కార్మికుల్లో అసంతృప్తి కలిగిస్తోందన్నారు. గత ప్రభుత్వ కాలంలో కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించడం లేదని, కొత్త వేతన సవరణను అమలు చేయడంలో ఆలస్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఆర్టీసీలో ప్రవేశపెడుతున్న బ్యాటరీ బస్సులను ప్రైవేట్ రంగానికి అప్పగించకుండా ప్రభుత్వం స్వయంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు వామపక్ష పార్టీల పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని కార్మిక నాయకులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు శ్రీనివాస్, సంజీవ్, వామపక్ష పార్టీల నాయకులు వై.ఓమయ్య, రమేష్‌బాబు, వెంకటరాములు, పాపయ్య, వరదయ్య, నరేందర్, సుధాకర్, వెంకట్, రాములు, అనిల్, హుస్సేన్, నర్సింలు, రఘురాం, ఫిరోజ్ అలీ, సురేష్, గణేష్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ సమ్మెకు జీవన్ రెడ్డి మద్దతు



**ఆర్మూర్, ఏప్రిల్ 24(ప్రజా శంఖారావం) :**

గత మూడు రోజులుగా కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మెకు శుక్రవారం రోజు ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ డిపో ముందు ఉన్న శిబిరంకి బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి, సమ్మెలో ఉన్న ఆర్టీసీ కార్మికులందరికీ సంఘీభావం తెలుపుతూ వారికి మద్దతుగా కూర్చున్నారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య చేసుకుని చనిపోవడం వారి ఆత్మకు శాంతి కలగాలని శిబిరంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుని ఖండించారు. అలాగే ఈ సమ్మెకు పూర్తి మద్దతు బిఆర్ఎస్ పార్టీ ఇస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు, యూనియన్ లీడర్స్ చక్రవర్తి, రవి, అశోక్, టిఆర్ఎస్ పార్టీ ఆర్మూర్ పట్టణ శాఖ అధ్యక్షులు పూజా నరేందర్, కౌన్సిలర్లు పృథ్వి, అజీమ్, నయీమ్, సీనియర్ నాయకులు సుంకర రవి, పోల సుధాకర్, బిఆర్ఎస్ నాయకులు సెంట్ ఫాల్ బబ్లు, ఈగ గంగాధర్, సురేష్, హగ్గు క్రాంతి, మీరా శ్రావణ్, గిరీష్, శ్రీకర్, బోడమీద నరసయ్య, కళ్యాణ్, కాపల్లి గణేష్, హర్షత్, రమేష్, ప్రవీణ్ గౌడ్, లతీఫ్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24 (ప్రజా శంఖారావం):**



మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్త తెలిపారు. నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం మాజీ సైనిక సంక్షేమ సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సైనికులకు అందాల్సిన సంక్షేమ పథకాల అమల్లో జాప్యం జరుగుతోందని తెలిపారు. ఆస్తి పన్ను మినహాయింపు, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూముల కేటాయింపు వంటి అంశాలు త్వరగా అమలు కావడం లేదని ప్రతినిధులు తన దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆస్తిపన్ను విషయంలో మున్సిపల్ అధికారులతో చర్చిస్తానన్నారు. ఇదిలా ఉండగా, తమతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించిన మొదటి ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తేనని సంఘం జిల్లా అధ్యక్షుడు సూర హర ప్రసాద్ తెలిపారు. తమ సమస్యలను శ్రద్ధగా విన్నారని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మధుసూదన్, సహాయ కార్యదర్శి రూపేష్ కుమార్, సలహాదారులు మోహన్, కోశాధికారి థామస్ పాల్గొన్నారు.

## కాంతి హైస్కూల్లో అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం



**ఆర్మూర్, ఏప్రిల్ 24 (ప్రజా శంఖారావం):**

పెర్కిట్‌లోని కాంతి హైస్కూల్లో శుక్రవారం అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల ప్రతిభను గుర్తిస్తూ వివిధ విభాగాల్లో పురస్కారాలు అందజేశారు. అకాడమిక్ ఇంప్రూవ్‌మెంట్, బెస్ట్ హ్యాండ్‌రైటింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, డిసిప్లిన్ స్టార్, ఆర్ట్స్, మోస్ట్ ప్రొడక్టివ్, క్రియేటివ్ థింకర్స్, అటెండెన్స్ వంటి విభాగాల్లో ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపల్ కాంతి గంగారెడ్డి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి సంవత్సరం జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారని, వారి లక్ష్య సాధనకు అవసరమైన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించే దిశగా కృషి చేస్తున్నారని వెల్లడించారు. పాఠశాల డైరెక్టర్ వేల్పూర్ శశాంక్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఐఐటి, అబాకస్, వేదిక్ మ్యాథ్స్ వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చి భవిష్యత్తుకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి



**ఆర్మూర్, ఏప్రిల్ 24 (ప్రజా శంఖారావం):**

ఆర్మూర్ పట్టణం, పరిసర ప్రాంతాల్లో వైద్య సేవలను మెరుగుపర్చాలని కోరుతూ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో జరిగిన భేటీలో ఆర్మూర్ పట్టణంలోని 100 పడకల ఆసుపత్రిలో సిబ్బంది కొరతను ప్రస్తావిస్తూ పూర్తి స్థాయి డాక్టర్లు, ఇతర సిబ్బందిని నియమించాలని కోరారు. నందిపేట మండల కేంద్రంలోని పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి, 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మాయాపూర్ గ్రామ పీహెచ్‌సీకి పూర్తి స్థాయి సిబ్బంది నియామకం చేయడంతో పాటు ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు చేయాలని కోరారు. ఈ అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిపేట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సిలిండర్ లింగం, సర్పంచులు లక్ష్మీనారాయణ, శ్రీకాంత్, సాయి కుమార్, దేవేందర్, దేవదాసు, ముత్యం, నవీన్, మహమూద్, హనుమాన్, సుదన్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

శనివారం
ఏప్రిల్ 25, 2026
epaper.prajashankaravam.com
www.prajashankaravam.com
ప్రజా శంఖారావం
PRAJA SHANKARAVAM


## మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు వినతి



**ఆర్మూర్, ఏప్రిల్ 24 (ప్రజా శంఖారావం):**

నందిపేట, ఆర్మూర్ ప్రాంతాల్లో విద్యా సౌకర్యాల అభివృద్ధి కోసం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కలిసి కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో జరిగిన భేటీలో నందిపేట మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌కు కాంపౌండ్ వాల్ మంజూరు చేయాలని కోరారు. ఐలాపూర్ గ్రామానికి ఇంటర్మీడియట్ విద్యార్థులకు హాస్టల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్మూర్ పట్టణంలో రూ.కోటి వ్యయంతో నాలెడ్జ్ హబ్ సెంటర్ ఏర్పాటు చేయడంతో పాటు ఐదు మండలాల్లో ఒక్కో నాలెడ్జ్ హబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిపేట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సిలిండర్ లింగం, సర్పంచులు లక్ష్మీనారాయణ, శ్రీకాంత్, సాయి కుమార్, దేవేందర్, దేవదాసు, ముత్యం, నవీన్, మహమూద్, హనుమాన్, సుదన్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## వడగండ్ల నష్టం.. రైతులకు తక్షణ సహాయం అవసరం



**నిజామాబాద్ రూరల్/సిరికొండ, ఏప్రిల్ 24 (ప్రజా శంఖారావం):**

జిల్లాలో ఇటీవల కురిసిన వడగండ్ల వానతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, రైతులను వెంటనే ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్, ఏఐయూకెస్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి, డిచ్‌పల్లి, ఆర్మూర్ తదితర మండలాల్లో వరి, మొక్కజొన్నతో పాటు టమాటా, మిర్చి, నువ్వులు, మామిడి పంటలు భారీగా నష్టపోయినట్లు తెలిపారు. చేతికొచ్చిన పంట నష్టపోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వరి ధాన్యం కొనుగోలు మందగించడం రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. దొడ్డు రకం ధాన్యాన్ని కూడా ఆలస్యం లేకుండా కొనుగోలు చేయాలని కోరారు. కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచి, నష్టపరిహారం వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## ఆన్‌లైన్ ఔషధ విక్రయాలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు వినతి



**చేగుంట ఏప్రిల్ 24 (ప్రజా శంఖారావం):**

మెదక్ జిల్లా, చేగుంట మండలం, తెలంగాణ రాష్ట్ర కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, ఫార్మసీ కౌన్సిల్ ఎలెక్టెడ్ మెంబెర్, మెదక్ జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అధ్యక్షులు తోడుపునూరి రాజు నేతృత్వంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు వినోద్ కుమార్, వికారాబాద్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు ఈరోజు శాసనసభ సభాపతి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న మెడిసిన్ అమ్మకాల వల్ల తలెత్తుతున్న సమస్యలను స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆన్‌లైన్ వేదికలపై మత్తు మందులు సులభంగా లభించడం వల్ల యువత వ్యసనాల బారిన పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ విక్రయాలను తక్షణమే నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మెడికల్ షాపుల యజమానులు ఎదుర్కొంటున్న సాధకబాధలతో పాటు ఆన్‌లైన్ ఫార్మసీల వల్ల వృత్తికి కలుగుతున్న నష్టాన్ని వివరించి, ప్రజారోగ్య రక్షణ కోసం నిబంధనలను కఠినతరం చేయాలని విన్నవించారు.

# ఎఫ్ 3 వాటర్ పార్క్ ప్రారంభం

### వినోదానికి కొత్త చిరునామా జోర్పూర్

**ఆర్మూర్ ఏప్రిల్ 24(ప్రజా శంఖారావం):**

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట్ మండలం జోర్ పూర్ గ్రామంలో ఆధునిక సదుపాయాలతో రూపొందించిన ఎఫ్3 వాటర్ పార్క్ ఘనంగా ప్రారంభమైంది. యజమాని ఇమ్రాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పార్క్ ప్రారంభ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. ఈ వాటర్ పార్క్‌లో స్విమ్మింగ్ పూల్, రైన్ డ్యాన్స్, కిడ్స్ ప్లే జోన్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ సదుపాయాలు అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఆనందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయడం విశేషం. భద్రతా ప్రమాణాలను పాటిస్తూ, పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ పార్క్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు చల్లని వినోదాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ పార్క్‌ను ప్రారంభించినట్లు యాజమాన్యం తెలిపారు. గ్రామీణ ప్రాంతంలోనే ఇలాంటి సదుపాయాలు అందుబాటులోకి రావడం పట్ల స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా స్థానిక ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై పార్క్‌ను సందర్శించారు. రాబోయే రోజుల్లో ఈ వాటర్ పార్క్ ప్రాంతీయ పర్యాటక ఆకర్షణగా మారే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.



# ఆర్టీసీ సమ్మెకు సంపూర్ణ మద్దతు

**భీంగల్, ఏప్రిల్ 24(ప్రజా శంఖారావం):**

ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సమ్మెకు 206 సంఘాలతో ఏర్పడిన టిజీఈజెఏసి పక్షాన సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు టిఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్క జనార్ధన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకుని వెంటనే చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలకు కూడా అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం చొరవ చూపి వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. గత ఆరు సంవత్సరాలుగా వారికి వేతన సవరణ జరగకపోవడం బాధాకరమని వారు కోరుతున్న ఇతర డిమాండ్లు కూడా న్యాయమైనవేనని ఆయన తెలిపారు. ఇటీవల



వరంగల్ జిల్లా నర్సంపేట డిపోకు చెందిన కోలా శంకరగౌడ్ తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోవడంతో నిరాశతో ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని ఆయన అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబానికి యావత్ తెలంగాణ ఉద్యోగులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులందరికీ టిజీఈజెఏసీ తరపున విన్నపం ఏమనగా కార్మికులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని రాష్ట్రంలోని టిజీఈజెఏసీలోని 206 సంఘాల మద్దతుతో పాటు, యావత్ తెలంగాణలోని 15,35,000 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంపూర్ణ మద్దతు ఉంటుందని మీరూ మా సహోద్యోగులేనని ఎవరూ ఆందోళన చెందకుండా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడొద్దని ఆయన మనవి చేశారు. సంఘాలు ముందుండి ఆర్టీసీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాయని ఆయన తెలిపారు.

# మీడియా అక్రిడిటేషన్ కమిటీతో కలెక్టర్ సమీక్ష

**కామారెడ్డి, ఏప్రిల్ 24 (ప్రజా శంఖారావం):**

జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో శుక్రవారం నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, జీఓ 252 ప్రకారం నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. మీడియా ప్రతినిధులు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొంటూ, కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించి మీడియాపై ప్రజల నమ్మకాన్ని మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకొని అక్రిడిటేషన్ ప్రమాణాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, డీపీఆర్ఓ తిరుమలతో పాటు కమిటీ సభ్యులు వి. రజనీకాంత్, మంత్రి ఆంజనేయులు, వుక్కల్కర్ రాజేందర్‌నాథ్, వేణుగోపాల చారి, సయ్యద్ కౌసర్ అలీ, వి. శశిధర్, షేక్ మొయినుద్దీన్, బొక్కల వేణు, గంట చంద్రశేఖర్, మహమ్మద్ ఆబిద్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా కరాటే బెల్టింగ్ అవార్డు




**భీంగల్, ఏప్రిల్ 24 (ప్రజా శంఖారావం):**

భీంగల్ మండలంలోని ఆక్స్‌ఫర్డ్ హై స్కూల్‌లో శుక్రవారం కరాటే బెల్టింగ్ అవార్డు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్లాక్ బెల్ట్ 7 డాన్ రచ్చ శ్రీను బాబు హాజరై విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా ఆ.పవన్, టీ. సురేష్ కుమార్, వీడీసీ ప్రెసిడెంట్ పతని కృష్ణ, కరస్పాండెంట్ కే. జగదీప్, అతిథులు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని, క్రీడలు ఆడడం ద్వారా విద్యార్థుల మెదడు అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అది చదువులో మంచి ఫలితాలు సాధించేందుకు దోహదపడుతుందని అన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణకు అతిథులు కృతజ్ఞతలు తెలియజేసి, కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.ఈ కార్యక్రమంలో సర్వ సమాజ్ సలహా కమిటీ సభ్యులు, రాగి రఘు, కోట జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో స్టేట్ ఫస్ట్ విద్యార్థికి సన్మానం



**భీమ్‌గల్, ఏప్రిల్ 24 (ప్రజా శంఖారావం):**

ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో స్టేట్ ఫస్ట్ సాధించిన భీమ్‌గల్ పట్టణానికి చెందిన విద్యార్థి రస సహదేవ్‌ను సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో 470 మార్కులకు 469 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సహదేవ్‌కు శాలువా కప్పి, పూలమాలతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు పతాని కృష్ణ, సభ్యులు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సలహా కమిటీ సభ్యులు రాగి రఘు, కోట జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ అదనపు ఎస్పీగా విక్రాంత్ కుమార్ సింగ్



**మెదక్ ఏప్రిల్ 24 (ప్రజా శంఖారావం) :**

మెదక్ జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి బదిలీపై మెదక్ జిల్లా అదనపు ఎస్పీగా నియమితులైన విక్రాంత్ కుమార్ సింగ్ (ఐపీఎస్) శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు (ఐపీఎస్)ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు సత్వర సేవలు అందించడంలో ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. పోలీస్ శాఖ అభివృద్ధికి, సమర్థవంతమైన పనితీరుకు అందరూ సమన్వయంతో కృషి చేయాలని ఈ సందర్భంగా చర్చించారు.

## భూమి మార్పిడి చేసిన రెవెన్యూ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి

**చేగుంట/మసాయి పేట్ ఏప్రిల్ 24 (ప్రజా శంఖారావం):**



మెదక్ జిల్లా, మాసాయిపేట మండలం పోతన్ పల్లి గ్రామానికి చెందిన బర్రె సత్తయ్య తమ భూమిని రెవెన్యూ శాఖలో పనిచేస్తున్నటువంటి బర్రె బాబు ,తమ పేరున తొలగించి, రెవెన్యూ రికార్డులో తన పెరు నమోదు చేయిం చుకొని, తమను మోసం చేసిన,రెవెన్యూ శాఖ ఉద్యోగిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితుడు పోతన్ పల్లి గ్రామానికి చెందిన బర్రె సత్తయ్య అధికారులను వేడుకుంటున్నాడు. తమ గ్రామంలోని సర్వే నెంబర్ 203 లో తమ తండ్రి బర్రె పెంట బర్రె పెద్ద పోచయ్య దగ్గర కొనుగోలు చేశారని, ఇప్పటికీ ఈ భూమిలో తామే కాస్తు జేస్తూ జీవిస్తున్నామన్నారు. ఇట్టి భూమిని రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న బర్రె బాబు మా అమాయకత్వాన్ని, ఆర్థిక పరిస్థితిని ఆసరా చేసుకొని అధికారూలనూ తప్పుదోవ పట్టించి మాకు సంబంధించిన భూమిని అక్రమంగా తన పేరున రికార్డుకు ఎక్కించుకున్నాడని, తాము ప్రశ్నిస్తే నంబర్లు తారుమారు అయ్యాయని బుకాయిస్తున్నాడన్నారు. తమ భూమి తమకు చేసిస్తానంటూ కాలం గడుపుతున్నారన్నారు అన్నారు, రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి విచారణ జరిపి మమ్మల్ని మోసం చేసిన బర్రె బాబుపై తగు చర్యలు తీసూకొని మాకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.

## పెద్ద శివనూర్ లో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

**చేగుంట ఏప్రిల్ 24 (ప్రజా శంఖారావం) :**

మెదక్ జిల్లా, చేగుంట మండలం పెద్ద శివనూర్ గ్రామంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె ప్రగతే దేశానికి ప్రగతి అని, ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామ పంచాయతీలకు ప్రత్యేక స్థానం ఉందని వక్తలు కొనియాడారు. గ్రామ పంచాయతీల సక్రమ నిర్వహణే దేశాభివృద్ధికి నిజమైన సూచిక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రతినిధి ఎర్ర నర్సింలు, పంచాయతీ సెక్రటరీ ప్రశాంత్, ఉప సర్పంచ్ అన్నం మల్లేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అన్నం ఆంజనేయులు, వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



## ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన హౌసింగ్ ఏఈ

**చేగుంట ఏప్రిల్ 24 (ప్రజా శంఖారావం) :**

మెదక్ జిల్లా,చేగుంట మండలం, పెద్ద శివనూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను హౌసింగ్ ఏఈ రియాజ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమా ణాలు పాటించాలని, ముఖ్యంగా నాణ్యమైన ఇసుకను వాడాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని సకాలంలో నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ప్రశాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అన్నం ఆంజనేయులు, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సన్మానం

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24 (ప్రజా శంఖారావం):**

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ డాక్టర్ నాగమోహన్‌ను బీసీటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆసుపత్రిలోని ఆయన కార్యాలయంలో శాలువా కప్పి, పూలబొకేతో అభినందనలు తెలియజేసి సావిత్రిబాయి పూలే జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మాడవేడి వినోద్ కుమార్ మాట్లాడుతూ సేవాభావం కలిగిన నాగమోహన్ జిల్లా ఆసుపత్రికి సూపరింటెండెంట్‌గా రావడం పేదలకు ఉపయోగకరమని తెలిపారు. ఆయన సేవలతో జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో అసోసియేటెడ్ జిల్లా అధ్యక్షుడు పెద్దోళ్ల నాగరాజు, బీసీటీయూ అసోసియేటెడ్ అధ్యక్షుడు మోహన్, గౌరవ అధ్యక్షుడు కైరంకొండ బాబు, కార్యనిర్వాహక అధ్యక్షుడు కంచరి రవికుమార్, రామకృష్ణ, సలహాదారు రమణస్వామి, కోశాధికారి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సతీష్ కుమార్, వేణు, రవిచంద్ర, సుమన్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్‌లో జాగిలాలతో పోలీసుల తనిఖీలు





**ఆర్మూర్ ఏప్రిల్ 24(ప్రజా శంఖారావం):**

ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని, ఆర్మూర్ పోలీసులు శుక్రవారం ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో జాగిలాల సహాయంతో భారీ తనిఖీలు నిర్వహించారు. ఆర్మూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సత్యనారాయణ గౌడ్ నేతృత్వంలో సిబ్బంది ఈ ఆకస్మిక సోదాల్లో పాల్గొన్నారు. స్నిఫర్ డాగ్స్‌తో సోదాలు. మాదకద్రవ్యాల రవాణాను అరికట్టడమే లక్ష్యంగా, శిక్షణ పొందిన స్నిఫర్ డాగ్స్ సాయంతో బస్టాండ్ మొత్తాన్ని జల్లెడ పట్టారు. ఈ సందర్భంగా అనుమానితుల తనిఖీ బస్టాండ్‌లో అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను ప్రశ్నించడంతో పాటు, వారి వద్ద ఉన్న లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ పి.సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ తనిఖీలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ సోదాల్లో ఎటువంటి అక్రమ వస్తువులు లేదా మాదకద్రవ్యాలు లభ్యం కాలేదని, బస్టాండ్ అంతా సురక్షితంగా ఉందని ఎస్‌హెచ్‌ఓ వెల్లడించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ఇందల్వాయి , ఏప్రిల్ 24, (ప్రజా శంకరావం ):**

మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం గ్రామ సర్పంచ్ కన్నె రాజేందర్ గారి అధ్యక్షతన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోకుండా, ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను వినియోగించుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. రైతులు నిబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటించి, ధాన్యాన్ని కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. ఏపీఎం మాట్లాడుతూ, ఐకేపీ సిబ్బంది రైతులకు నిరంతరం అందుబాటులో ఉండి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తారని హామీ ఇచ్చారు. గతేడాది తరహాలోనే ఈ ఏడాది కూడా పారదర్శకంగా కొనుగోళ్లు సాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ నల్లవెల్లి సిబ్బంది, గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, వీడీసీ సభ్యులు మరియు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రధాన పార్టీలకు కార్యాలయాలే కరువు..!




**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24 (ప్రజా శంఖారావం):**

**రాజకీయ పార్టీలకు జెండాలు, అజెండాలు, నినాదాలు ఉన్నాయి. కానీ స్థిరమైన చిరునామా లేక ప్రజలు పార్టీ నాయకులను వెళ్లి కలవడానికి అడ్రస్ లేక కొన్ని పార్టీలు చతికిలా పడిపోతున్నాయన్నది కఠోర వాస్తవం. నగరంలో ప్రధాన రాజకీయ పార్టీలకు కార్యాలయాలు లేకపోవడంతో ఒక వైపు ప్రజలు, మరోవైపు పార్టీ కార్యకర్తలు కూడా అవస్థలు పడుతున్నారు. ప్రజల సమస్యలు వినడానికి, కార్యకర్తలతో చర్చలు జరపడానికి స్థిరమైన కార్యాలయం అవసరం ఉన్నప్పటికీ, చాలా పార్టీలకు ఇది కేవలం కలగానే మిగిలిపోయింది.**

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణ కేంద్రంలో ప్రముఖ రాజకీయ పార్టీల కార్యకలాపాలు తాత్కాలిక స్థలాలైన హోటల్లు, ఖాళీ స్థలాలకే పరిమితమవుతున్నాయి. కొన్ని ప్రధాన పార్టీల నాయకుల వ్యక్తిగత కార్యాలయాలు, మరికొందరు అద్దె గదుల ప్రదేశాల్లోనే సమావేశాలు జరుపుతున్నారు. ప్రజల కోసం పోరాడే పార్టీకి, ప్రజలు వచ్చి స్థానిక సమస్యలు చెప్పుకునే చిరునామా కూడా లేకపోవడం విడ్డూరం. పార్టీ కోసం పనిచేసే మాకు ఒక స్థిరమైన కేంద్రం లేకపోతే ఎలా ముందుకు సాగాలని పార్టీల కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ విశ్లేషకులు మాత్రం దీనిని పార్టీ అంతర్గత బలహీనతగా భావిస్తున్నారు. కార్యాలయం అంటే కేవలం భవనం కాదనీ, అది పార్టీ యొక్క బలం, వ్యవస్థ, క్రమశిక్షణకు ప్రతీక అని మరి కొంతమంది అంటున్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే తాత్కాలిక కార్యాలయాలు, తర్వాత మాయమవుతున్న నాయకత్వాన్ని చూస్తుంటే ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. పార్టీల గెలుపు ఓటర్లపై ఆధారపడితే, ఆ ఓటర్లను కలిసే కార్యాలయం ఆ పార్టీకి ఆధారం అనే మాటలను గుర్తుచేసుకుంటే, ప్రస్తుత పరిస్థితి ఎంత దయనీయమో అర్థమవుతోంది. కార్యాలయం లేని పార్టీ అంటే దిశలేని నౌక లాంటిదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాయకులు భారీ మీటింగులు, మీడియా స్టేట్‌మెంట్లు, సోషల్ మీడియా ప్రచారాల్లో బిజీగా ఉంటూ స్థిరమైన కార్యాలయం ఏర్పాటు చేయడంలో మాత్రం విఫలమవుతున్నారనేది నగ్న సత్యం. ప్రజల మధ్య ఉండాలంటే ముందుగా ఒక చిరునామా ఉండాలి లేకపోతే అది నాయకత్వం కాదు, నటన మాత్రమే అనే కఠిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో వినబడుతున్న మాట. ఇప్పటికైనా పార్టీలు స్వీయ పరిశీలన చేసుకుని, ప్రజలకు అందుబాటులో ఉండే కార్యాలయాలు ఏర్పాటు చేస్తాయా? లేకపోతే పేరు ఉన్నా.. ఉనికి లేని పార్టీలుగా మిగిలిపోతాయా...? అన్న ప్రశ్నలకు ప్రధాన పార్టీల నాయకులు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

## గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



**చేగుంట/ మాసాయిపేట ఏప్రిల్ 24 (ప్రజా శంఖారావం) :**

మెదక్ జిల్లా,మాసాయిపేట మండల పరిధిలోని కొప్పులపల్లి, అచ్చంపేట్, హకీంపేట్, బొమ్మారం, పోతన్ పల్లి, నాగ్సన్ పల్లి, చెట్ల తిమ్మాయిపల్లి, నడిమి తండా గ్రామాలకు చెందిన గర్భిణీ స్త్రీలకు నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్, రాజన్న ఫౌండేషన్ చైర్మన్ ఆవుల రాజిరెడ్డి 100 మాతృదేవోభవ న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టబోయే బిడ్డలు బలంగా ఉండాలంటే గర్భిణీలు ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. గర్భధారణ సమయంలో సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారానే తల్లి, శిశువు క్షేమంగా ఉంటారని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ గర్భిణీ స్త్రీల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారి ఆరోగ్యాన్ని కాపాడడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ అవసరమైన వారికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డీ, స్థానిక సర్పంచ్ కృష్ణ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మీవరం



**భీమ్‌గల్, ఏప్రిల్ 24 (ప్రజా శంఖారావం):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి చెక్కులు ఇస్తూ కొద్దిగా భారాన్ని తగ్గించడం అభినందనీయమని స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొరడి లింబాద్రి, (బద్రి)అన్నారు. భీమ్‌గల్ మండలంలోని ముచ్కూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం స్థానిక కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అలాగే సర్పంచ్ కొడిగెల శ్రీనివాస్ చేతుల మీదుగా లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, పేదింటి ఆడబిడ్డలకు ఆదుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, అలాగే బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రకుమార్, రాష్ట్ర కో- ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి,మైనింగ్ శాఖ చైర్మన్ ఈరవత్రి అనిల్ లకు లబ్ధిదారులు, నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలనాధికారి గంగాధర్, పంచాయతీ సెక్రటరీ రమాదేవి, పంచాయతీ కార్యదర్శి ఉప సర్పంచ్ బాశెట్టి రమేష్, నాయకులు గట్టు మురారి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బద్ది అవినాష్, కొరడి రాజు, కొరడి లింబాద్రి, అంతం గంగాగౌడ్, బసిరి రాజు, భాశెట్టి రాము, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు,వార్డ్ మెంబర్ లు వికాస్,మమత, సుమలత, బోల్ట్ రంగారెడ్డి, గిర్ని రాజు, విల్సన్, గంగాధర్ గౌడ్, గంగారెడ్డి ప్రభాకర్, గౌడ్, మంద భూమేష్ రెడ్డి, అశోక్, చిన్న కృష్ణగౌడ్, భాస్కర్ పాల్గొన్నారు.

## వాసవి మాత జయంతి ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

**సుల్తానాబాద్, ఏప్రిల్ 24 (ప్రజా శంఖారావం):**

పట్టణంలోని వాసవి మాత దేవాలయంలో ఈనెల 26న జరగనున్న జయంతి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను తెలంగాణ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయ రమణారావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాసవి మాత జయంతి ఉత్సవాలను ప్రభుత్వపరంగా నిర్వహించేందుకు జీవో జారీ చేసినందుకు ఆర్యవైశ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రభుత్వ విప్‌గా నియామకం జరిగిన సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.



## మల్లాపూర్ వాగులో అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్ సీజ్ : డ్రైవర్‌పై కేసు



**ఇందల్వాయి, ఏప్రిల్ 24 (ప్రజా శంఖారావం):**

మల్లాపూర్ గ్రామ శివారులోని వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున దాడులు నిర్వహించారు. వాగు వద్ద పరిశీలించగా ఇసుక లోడ్‌తో ఒక ట్రాక్టర్ తరలింపుకు సిద్ధంగా ఉండటాన్ని గుర్తించారు. వెంటనే ట్రాక్టర్‌ను ఆపి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇసుక రవాణాకు సంబంధించి ఎటువంటి అనుమతి పత్రాలు లేవని తేలడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రతిభా రత్న అవార్డు అందుకున్న డా.బాలు



**కామారెడ్డి, ఏప్రిల్ 24 (ప్రజా శంఖారావం) :**

జిల్లా కేంద్రానికి చెందిన ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు ప్రతిష్టాత్మక "ప్రతిభా రత్న టాలెంట్ అవార్డు–2026"ను అందుకున్నారు. ఈ అవార్డును హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖులు సంయుక్తంగా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఐవిఎఫ్ జాతీయ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ నేషనల్ చైర్మన్ కొంపల్లి సత్యనారాయణ, నేషనల్ ఇన్‌చార్జ్ బీరెల్లి చంద్రశేఖర్ గుప్తలు డాక్టర్ బాలుకు అవార్డును అందజేశారు. అవార్డు స్వీకరించిన అనంతరం డాక్టర్ బాలు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న వారికి సకాలంలో రక్తం అందించడం తన లక్ష్యమని తెలిపారు. మానవ సేవే జీవితానికి సార్థకతనిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా తలసేమియా బాధిత చిన్నారుల ప్రాణాలను కాపాడేందుకు రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు.



## బ్లాక్ బాడీకాన్‌లో మత్తెక్కిస్తున్న సంయుక్త

సంయుక్తా మేనన్ తాజా ఫోటోషూట్‌లో బ్లాక్ బాడీకాన్ డ్రెస్‌లో స్టైలిష్ గ్లామర్ లుక్‌తో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించింది. మౌవ్ షేడ్ సాటిన్ ఆఫ్ షోల్డర్ డిజైన్‌తో ఉన్న డ్రేప్ ఆమె అవుట్‌ఫిట్‌కు హై ఫ్యాషన్ టచ్‌ను తీసుకొచ్చింది. వైన్ కలర్ ఫాబ్రిక్ భుజాలపై అందంగా మడతలు పడుతూ ఎలిగెంట్ లుక్‌ను క్రియేట్ చేసింది. వేవీ బ్రౌన్ హెయిర్, మెరిసే స్కిన్ టోన్, డైమండ్ డ్రాప్ ఇయరింగ్స్ కలిసి ఆమె అందాన్ని మరింతగా హైలైట్ చేశాయి. క్లోజ్ అప్ షాట్‌లో సంయుక్తా చూపులు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. బ్రౌన్ కళ్లతో పాటు డస్కీ రోజ్ లిప్ షేడ్ ఆమె లుక్‌కు అదనపు పవర్‌ను ఇచ్చింది. మొత్తం లుక్‌లో ఆమె దుస్తులు మాత్రమే కాదు, ఆ స్టైల్‌ను పూర్తిగా తనదిగా మలుచుకుని మెరిసింది



## యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్న దీపిక

షారుక్‌ఖాన్, సిద్దార్థ్ ఆనంద్ కాంబినేషన్‌లో రూపొందుతున్న మూవీ 'కింగ్'. ఈ సినిమాలో షారుక్‌కు జోడీగా బాలీవుడ్ నటి దీపికా పదుకొణె నటిస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా జరుగుతోన్న షూటింగ్ షెడ్యూల్‌లో ఆమెపై యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. రెండోసారి తల్లి కానున్నట్లు దీపిక ఇటీవల ప్రకటించారు. దీంతో ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాలను తగ్గిస్తారని అంతా అనుకున్నారు. దానికి భిన్నంగా ఏప్రిల్ 21, 22 తేదీల్లో దీపిక భారీ యాక్షన్ సీన్స్ చేశారట. ప్రత్యేకంగా వేసిన సెట్‌లో ఈ పోరాట సన్నివేశాలు రూపొందించినట్లు సమాచారం. త్వరలోనే 8 మందితో కూడిన ఫైట్ సన్నివేశాన్ని కూడా సిద్దార్థ్ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఇసుకలో ఫైట్ తీయనున్నారట. షారుక్, దీపిక ఇద్దరూ కలిసి ఫైట్ చేయనున్నట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. మరోవైపు ఈ సినిమా విడుదలను డిసెంబర్ 24కే ఖరారు చేస్తూ టీమ్ తాజాగా కొత్త వీడియోను పంచుకుంది. దీంతో అనుకున్న సమయానికి సినిమా వస్తుందా? రాదా? అనే వార్తలకు చెక్ పడింది. క్రిస్మస్‌కు కింగ్ సందడి షురూ అంటూ అభిమానులు ఆ వీడియోను పంచుకుంటున్నారు.



## రెడ్ డ్రెస్‌లో రకుల్ హాట్ లుక్..

అయుష్మాన్ ఖురానా నటిస్తున్న తాజా కామెడీ చిత్రం 'పతి పత్ని ఔర్ వో దో'లోని కొత్త పాట "రోప్ ది రాణి" ప్రమోషన్లతో రకుల్ ప్రీత్ సింగ్ మరోసారి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ పాట ప్రచారంలో భాగంగా రకుల్ విడుదల చేసిన తాజా ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బోల్డ్ రెడ్ మినీ డ్రెస్‌లో, ఆకట్టుకునే రఫుల్ షోల్డర్స్‌తో ఆమె కనిపించి గ్లామర్ లుక్‌తో అభిమానులను మెస్మరైజ్ చేసింది. గోల్డ్ హూప్ ఇయరింగ్స్, స్లీక్ హెయిర్ స్టైల్ ఆమె లుక్‌కు మరింత హైలైట్‌గా నిలిచాయి. "రోప్ ది రాణి" టీజర్ ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి హైప్ క్రియేట్ చేసింది. ఇందులో రకుల్ ప్రీత్ సింగ్‌తో పాటు అయుష్మాన్ ఖురానా, వామికా గబ్బి, సారా అలీ ఖాన్ కలిసి చేసిన డాన్స్ మూమెంట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. రంగురంగుల విజువల్స్, ఎనర్జిటిక్ మ్యూజిక్‌తో సినిమా స్టైల్‌ను టీజర్ స్పష్టంగా చూపిస్తోంది. ఈ చిత్రం 2026 మే 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. కొత్త పాట కోసం సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## స్టార్ హీరోల కోసం 'యంగ్ బ్యూటీస్' రిస్క్

**క్రేజీ ప్రాజెక్టులకే మొగ్గు!**

**ఎన్టీఆర్ 'డ్రాగన్' కోసం ఇతర ఆఫర్లను వదులుకున్న రుక్మిణి వసంత్**

**నాని - శ్రీకాంత్ ఓదెల మూవీపైనే కయ్యదు లోహర్ ఆశలు**

టాలీవుడ్‌లో గ్లామర్ ప్రపంచం ఎప్పుడూ అవకాశాల వేటలో ఉంటుంది. కానీ, ఇద్దరు యంగ్ హీరోయిన్లు మాత్రం దొరికిన అవకాశాలను కాదని, కేవలం స్టార్ హీరోల సినిమాల కోసమే పట్టుబట్టి కూర్చోవడం ఇప్పుడు ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. భారీ ప్రాజెక్టులు హిట్ అయితే కెరీర్ మలుపు తిరుగుతుందనే నమ్మకంతో వారు ఇతర పెద్ద ఆఫర్లను కూడా సున్నితంగా తిరస్కరిస్తున్నారు. కన్నడ చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న బ్యూటీ రుక్మిణి వసంత్ ఇప్పుడు టాలీవుడ్ ఎంట్రీపై గట్టి ఫోకస్ పెట్టింది. గ్లోబల్ స్టార్ ఎన్టీఆర్ -- ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ 'డ్రాగన్'లో ఆమెను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు సమాచారం. అయితే, ఈ సినిమా షూటింగ్‌కు భారీగా డేట్స్ అవసరం కావడంతో, ఆమె చేతికి వచ్చిన మరో మూడు, నాలుగు పెద్ద సినిమాల ఆఫర్లను వదులుకున్నట్లు వినికిడి. ప్రశాంత్ నీల్ సినిమాలో ఛాన్స్ వస్తే కెరీర్ నెక్స్ట్ లెవెల్‌కు వెళు ందని ఆమె భావిస్తోంది. మరోవైపు, నేచురల్ స్టార్ నాని -- శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న 'ది ప్యారడైజ్' చిత్రంపై కయ్యదు లోహర్ భారీ ఆశలు పెట్టుకుంది. 'దసరా' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో కీలక పాత్ర దక్కడంతో, ఆమె ఇతర చిన్న సినిమాల వైపు చూడటం లేదని టాక్. ఈ ఒక్క సినిమా షూటింగ్‌కే ఆమె తన సమయాన్ని పూర్తిగా కేటాయించిందట. కేవలం ఒక్క సినిమా కోసం ఇతర అవకాశాలను వదులుకోవడం ప్రస్తుత పోటీ ప్రపంచంలో పెద్ద రిస్క్ అని కొందరు అభిప్రాయపడుతుంటే, స్టార్ సినిమాలతో వచ్చే 'బిగ్ బ్రేక్' ముందు ఇవన్నీ చిన్నవని మరికొందరు విశ్లేషిస్తున్నారు. ఈ ముద్దుగుమ్మల ప్లాన్ ఎంతవరకు ఫలిస్తుందో తెలియాలంటే ఆ సినిమాలు విడుదలయ్యే వరకు వేచి చూడాల్సిందే.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PUTTI MURALI, PRINTED AT INDUR OFFSET PRINTERS, OPP : CHEER HANUMAN TEMPLE, WEEKLY BAZAR,NIZAMABAD- 503001, NIZAMABAD DISTRICT, TELANGANA STATE, PUBLISHED AT HNO.1-86/10/05, KOTARMOOR(PERKIT), ARMOOR-503224, NIZAMABAD DISTRICT, TELANGANA STATE. EDITOR : PUTTI MURALI, TELTEL/2022/85170, EMAIL :prajashankaravam@gmail.com